**ఇప్పటి వరకే రూ.11.83 కోట్లు**
మేడారం హుండీల ఆదాయం



2


# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - మంగళవారం 10 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 38 | పేజీలు: 8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


**రైళ్లలో ఇ-ప్యాంట్రీ సౌకర్యం**



2

# టీం వర్క్ చేద్దాం... అభివృద్ధి సాధిద్దాం

## ప్రజలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర అభివృద్ధి

## రెండేళ్లలో అమరావతి నెక్స్ట్ లెవల్

మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ

19నెలల్లో అగాధం, అంధకారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేశాం

సీఎం చంద్రబాబు నాయుడు



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: ప్రజలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని... టీం వర్క్ చేసి అభివృద్ధి సాధిద్దామని సీఎం చంద్రబాబు అధికారులకు పిలుపునిచ్చారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు అభివృద్ధి పై దిశనిర్దేశం చేశారు. అమరావతి కేంద్రంగా క్వాంటం కంప్యూటింగ్కు శంకుస్థాపన చేశామని సీఎం చంద్రబాబు అన్నారు. ఇక్కడి నుంచి క్వాంటం కంప్యూటర్లు తయారవుతాయని వెల్లడించారు. మనమే ప్రపంచానికి క్వాంటం కంప్యూటర్లు అందిస్తామని తెలిపారు. జీఎస్డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలు, రాష్ట్రానికి

...మిగతా 2లో

## ఉదాసీనత వీడండి

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి ముందుకు వెళ్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారు. ఉప ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నిర్ణయాల అమలు, పనుల పూర్తి విషయంలో అలసత్వం వద్దని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఇంకా కొన్ని లోపాలు కనిపిస్తున్నాయని అప్ర మత్తం చేసారు. ఉదాసీనత వీడాలని... పారదర్శకతతో ముందుకు వెళ్లాలని స్పష్టం చేసారు. అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు నిబద్ధతతో పని చేయాలని నిర్దేశించారు. . నాలుగు గోడల మధ్య మంత్రులు, ఉన్నతాధికారులు తీసుకునే ప్రజోపయోగ నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అర్థవంతంగా అందాలంటే అంతా సమష్టిగా పనిచేయాలని నిర్దేశించారు. ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం విషయంలో రాజీపడటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొని అభివృద్ధి పనులు చేపడుతున్నా మని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ

...మిగతా 2లో



## గిరిజన బిడ్డల గురించి ఎందుకు మాట్లాడరు

### వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల



విజయవాడ, మనంప్రత్యేక ప్రతినిధి: కుక్కల సంరక్షణ గురించి మాట్లాడే సెలబ్రిటీలు.. గిరిజన బిడ్డల గురించి ఎందుకు మాట్లాడం లేదు అంటూ వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామలనర్సింహ్మారెడ్డి ట్వీట్ చేశారు.'కుక్కల సంరక్షణపై మాట్లాడడానికి మనకు ఎందరో సెలబ్రిటీలు ఉన్నారు.. కానీ గిరిజన బిడ్డల గురించి మాట్లాడడానికి ఎవరూ లేకపోవడం దౌర్భాగ్యం!. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉడకని ఇడ్లీ , నిల్వ చట్నీ.. 89 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో 70 మందికి చికిత్స.. ఒకే మంచంపై నలుగురైదుగురికి సెలైన్లు. ఆశ్రమ పాఠశాలల్లో మరణమృదంగం మోగుతున్నా.. తీరు మారని బాబు సర్కారు.. గిరిజన విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం. కూటమి అధికారం చేపట్టాక ఏపీలో ఇప్పటివరకు సరైన ఆహారం , మంచినీరు , వైద్యం లేక.. 50 మంది వరకు మరణించారు.. వందలమంది అనారోగ్యం బారిన పడ్డారు. దీనిపై ఏ మీడియాలోనూ చర్చలు జరగవు.. ఏ మేధావులూ మాట్లాడరు. కుక్కల సంరక్షణపై మాట్లాడడానికి మనకు ఎందరో సెలబ్రిటీలు ఉన్నారు.. కానీ గిరిజన బిడ్డల గురించి మాట్లాడడానికి ఎవరూ లేకపోవడం దౌర్భాగ్యం' అంటూ ట్వీట్ చేశారు.

**తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు**



3

**క్రీడలతో ఒత్తిళ్లను అధిగమించవచ్చు**



3

## ఐదు బంగారు పతకాలు గెలుచుకున్న భారత్

8

## ఆన్‌లైన్ గేమింగ్ ఆటకట్టు


### రూ.5వేల కోట్ల నెట్‌వర్క్ ఛేదించిన జీఎస్‌టీ ఇంటెలిజెన్స్

దుబాయ్ కేంద్రంగా రాకెట్

ఇద్దరు నిందితుల అరెస్ట్

హవాలా మార్గంలో నిధుల మళ్లింపు

రంగంలోకి దిగనున్న ఈడీ



2

## భారత వృద్ధి 6.4 శాతం

హైదరాబాద్, ఫిబ్రవరి 9: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మొదలయ్యే 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి 6.4 శాతం మేర పెరుగుతుందని ప్రముఖ రేటింగ్స్ సంస్థ మూడీస్ అభిప్రాయపడింది. దీనివల్ల జీ-20 దేశాల్లోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్ నిలుస్తుంది. ప్రధానంగా దేశీయ వినియోగం పటిష్టంగా ఉండటంతో పాటు అందుకు మద్దతుగా విధానపరమైన చర్యలు, తక్కువ ద్రవ్యోల్బణం వంటి పరిణామాలు వృద్ధికి దోహదపడుతున్నాయి. మరీ ముఖ్యంగా దేశీయ వినియోగమే భారత వృద్ధికి కీలకమైన చోదకంగా

...మిగతా 2లో




## 'సర్'కు అడ్డంకులు కల్పించొద్దు

### బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

అన్ని రాష్ట్రాలూ ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని 'సూచనాత్మక హెచ్చరిక'



ఢిల్లీ, ఫిబ్రవరి 9: బెంగాల్లో నిర్వహిస్తోన్న 'సర్' ప్రక్రియను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. 'సర్ ప్రక్రియలో అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని ఈ సందర్భంగా బెంచ్ బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించింది. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ(సర్) కోసం 300 మంది అధికారులను కేటాయించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే..80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని,

...మిగతా 2లో

## స్పీకర్‌పై విపక్షాల అవిశ్వాసం!

### ఓం బిర్లా తమను మాట్లాడనివ్వడం లేదని విపక్షాల ఆరోపణలు



ఢిల్లీ, ఫిబ్రవరి 9: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదంతో ఉభయ సభల కార్యకలాపాలకు తరచూ అంతరాయం కలుగుతోంది. సభలో తమను మాట్లాడనివ్వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లోక్సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చేందుకు విపక్షాలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ కథనం వెల్లడించింది. అవిశ్వాస తీర్మానం తెచ్చేందుకు ఇప్పటికే విపక్షాలు నోటీసులిచ్చినట్లు సమాచారం. త్వరలోనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే, దీనిపై స్పందించేందుకు కాంగ్రెస్ నిరాకరించింది. తమ చర్య కోసం

...మిగతా 2లో

**ఫీజులు పెంచినా విదేశీ టాలెంట్ కావాల్సిందే..**

ఐటీతో 'హెచ్-1బీ'కీ డిమాండ్




6

# టీం వర్క్ చేద్దాం..అభివృద్ధి సాధిద్దాం

(మొదటి పేజీ తరువాయి)



వచ్చిన పెట్టుబడులు, పీపీపీ ప్రాజెక్టుల పురోగతి మీద చంద్రబాబు చర్చించారు. రియల్టైమ్ గవర్నెన్స్లో భాగంగా సాంకేతికతతో పాటు అవేర్, డేటా లీక్, పాలనలో ఏఐ టూల్స్ వినియోగం, కేంద్ర ప్రాయోజిత పథకాల యాక్షన్ ప్లాన్, యువతకు నైపుణ్యాభివృద్ధి, వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ప్రెన్యూర్ విధానం మీద మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అట్టడుగు వర్గాలకు కూడా చేరవేయాలని చెప్పారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ల సదస్సులు నిర్వహించేవారు కాదని, ఇప్పుడు మూడు నెలలకోసారి నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతీ నెలా.. రెండుసార్లు మంత్రివర్గ భేటీ జరుగుతోందన్నారు.

జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇన్చార్జి మంత్రులు సమర్థంగా పని చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రపంచం గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ వైపు వెళ్తోందన్నారు. అమరావతి కేంద్రంగా క్వాంటం కంప్యూటింగ్కు శంకుస్థాపన చేశామన్నారు. రెండేళ్లలో అమరావతి నుంచి క్వాంటం కంప్యూటర్లు తయారవుతాయన్నారు. మనమే ప్రపంచానికి క్వాంటం కంప్యూటర్లు అందిస్తామని తెలిపారు. ఏఐ, క్వాంటం కంప్యూటర్లు, డేటా సెంటర్లతో పెద్ద మార్పులు వస్తాయని వెల్లడించారు.

ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను నెలలవారీగా సమీక్షించుకోవాలి, క్షేత్రస్థాయిలో పనుల్ని బేరీజు వేసుకోవాలి. ప్రతీ నెలా 2సార్లు కేబినెట్ సమావేశాలు, ఎస్ఐపీబీ ద్వారా ప్రాజెక్టులకు ఆమోదం ఇస్తున్నాం. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇంచార్జ్ మంత్రులు కూడా అదే వేగంతో క్షేత్రస్థాయిలో పనులు జరిగేలా చూడాలి. గత 19 నెలల్లో ఏపీలో చేపట్టిన కార్యక్రమాలు, టెక్నాలజీ సహా ఏఐ అప్లికేషన్ల వినియోగం ఎలా జరుగుతుందో అంచనా వేసుకోవాలి. క్వాంటం వ్యాలీకి శంకుస్థాపన చేసుకున్నాం. త్వరలో ఉపకరణాలను కూడా తయారు చేసుకుని ఎగుమతులు చేసే పరిస్థితి వస్తుంది.' అని చంద్రబాబు అన్నారు.ప్రతీ మూడు నెలలకోసారి ప్రభుత్వ ప్రగతి... పనుల పురోగతిపై బేరీజు వేస్తున్నామని చంద్రబాబు చెప్పారు. ఇలా ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవడంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఏమేరకు చేరుకున్నామన్న అంశంపై స్పష్టతతో ఉంటున్నామన్నారు. గడచిన 19 నెలల్లో అగాధం, అంధకారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేశామని, వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టగలిగామని సీఎం చంద్రబాబు చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని, తల్లికి వందనం ద్వారా రూ.10 వేల కోట్లు తల్లుల ఖాతాల్లో వేశామన్నారు. స్త్రీశక్తి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ద్వారా మొబిలిటీ పెరిగిందని, 4.29 కోట్ల ప్రయాణాలు ఇప్పటి వరకూ జరిగాయని, ప్రస్తుతం ఉన్న బస్సులతోనే ఆక్యుపెన్సీ పెరిగిందని చంద్రబాబు తెలిపారు.'అన్నదాత సుఖీ భవ ద్వారా రూ. 6,310 కోట్ల ఆర్థిక సహకారం అందించాం. డిమాండ్ డ్రివెన్ క్రాప్స్ ఉత్పత్తి చేసేలా అవగాహన పెంచుతున్నాం. రాయలసీమలో హార్టి కల్చర్ హబ్, కోస్తాలో ఆక్వా కల్చర్ పెంచేలా చర్యలు చేపట్టాం. రైతు ఆత్మహత్యలనేవి జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం... ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే... వాటిని అధ్యయనం చేసి రైతులను ఆదుకుంటున్నాం. దీపం.2.0 ద్వారా 2 కోట్ల సిలెండర్లు ఇప్పటి వరకూ ఇచ్చాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా రూ.58 వేల కోట్ల మేర ఆర్థిక చేయూత అందించాం. సంక్షేమ పథకాలు అవసరమా...? అనే చర్చ సరి కాదు... పేదలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అవసరమే.' అని చంద్రబాబు అన్నారు.

### మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ

సంజీవని ద్వారా జూలై 2026 నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలి. 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల స్క్రీనింగ్ చేపట్టాలి. 12వ తరగతి వరకూ ఉన్న 70 లక్షల మంది విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ కూడా తయారు చేయాలి. కేర్ అండ్ గ్రో ద్వారా మాతా శిశు ఆరోగ్యం, పెరుగుదలను నమోదు చేయాలి. పౌష్టికాహారం అందించటంతో పాటు అవసరమైన సప్లిమెంట్స్ అందించేలా చర్యలు. నార్మల్ డెలివరీలు పెరిగేలా చూడాలి. వచ్చే ఏడాది ఎయిడ్స్ ఫ్రీ ఏపీగా డిక్లేర్ చేస్తాం. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్రమైన ఓ కార్డు జారీ చేస్తాం. మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.' అని చంద్రబాబు చెప్పారు.

### 100 రోజుల యాక్షన్ ప్లాన్

పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చంద్రబాబు అన్నారు. పరీక్షలు అంటే ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండేలా ఈ కార్యాచరణలో భాగం చేయాలన్నారు. ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోడానికి వీల్లేదని చెప్పారు. లేటరల్ ఎంట్రీ ఉండేలా యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో చర్యలు చేపట్టాలన్నారు. ఎలక్ట్రీషియన్, కార్పెంటర్ వంటి వారు ఉన్నత విద్యను అభ్యసించి సర్టిఫికెట్లను పొందేలా కార్యాచరణ ఉండాలన్నారు.

### వేసవిపై సీఎం సూచనలు

'పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. బోర్ల నుంచి కలుషితమైన నీరు రావటానికి వీల్లేకుండా చూడాలి. ఆశ్రమ బాలుర హాస్టల్లో కలుషిత నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు ఇక రాష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. మళ్లీ ఇలాంటి సంఘటనలు జరిగితే... దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇంఛార్జీ మంత్రులదే బాధ్యత. వేసవి రాబోతోంది. నీటి ఎద్దడి అనేది రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటి నుంచే సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలి.' అని ముఖ్యమంత్రి అన్నారు.

### హెలిప్యాడ్ కోసం భూమిని జగన్ బలవంతంగా లాక్కున్నారు...

వైఎస్ జగన్ ఇంటి దగ్గర ఉన్న హెలిప్యాడ్ భూమిపై ఆరా తీశారు. జగన్ ఇంటి పక్కన ఉన్న హెలిప్యాడ్ కోసం భూమిని బలవంతంగా లాక్కున్నారు.. ప్రైవేట్ వ్యక్తికి దగ్గర కొనుక్కున్న భూమిని హెలిప్యాడ్ కోసం ఇవ్వనంటే.. బెదిరించారు.. అయినా ఇవ్వకపోతే.. 22-ఎలో పెట్టారు.. ప్రైవేట్ ల్యాండ్ ను దుర్మార్గంగా లాక్కున్నారు.. చట్టాలు చేయాల్సిన ముఖ్యమంత్రి, చట్టాలను అమలు చేయాల్సిన వ్యక్తి ప్రైవేట్ వ్యక్తి భూమిని ఇల్లీగల్ గా 22-ఎ లో పెట్టాడు.. ఇది పరాకాష్ట కాదా? అని ప్రశ్నించారు. ఐదేళ్లు అవుతున్న అతనికి విముక్తి కలగలేదని తెలిపారు. మొన్న కలిసి అన్ని వివరాలు ఇచ్చారు.. భూములపై అప్పటి పాలకులు ఎంత దుర్మార్గంగా వ్యవహరించారు అనే దానిపై అందరూ ఆలోచించాలని చంద్రబాబు పేర్కొన్నారు.

### రెవెన్యూ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నాం...

రెవెన్యూ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా ఇస్తున్నాం.. భూ వివాదాలు లేకుండా.. పకడ్బందీగా సర్వే ప్రక్రియ చేపడుతున్నాం.. క్యూఆర్ కోడ్ సహా ఇతర భద్రతా ఫీచర్లతో పాస్ పుస్తకాలను అందజేస్తున్నాం.. సాగునీటి కోసం ఇప్పటి వరకూ రూ. 24 వేల కోట్లు ఖర్చు చేశాం.. క్వాంటం వ్యాలీకి ఇటీవలే శంకుస్థాపన చేసి అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా మారుస్తున్నాం.. విశాఖలో గూగుల్ తో పాటు ఇతర సంస్థలు కూడా డేటా సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాయి.. మొత్తం 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు రాబోతున్నాయి.. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీకి కూడా కార్యాచరణ మొదలైంది అని చంద్రబాబు వెల్లడించారు.



## 'సర్'కు అడ్డంకులు కల్పించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొంది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి.. ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. దీనివల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు చెప్పింది.

## ఉదాసీనత వీడండి
## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

(మొదటి పేజీ తరువాయి)

ఖజానా నుంచి ఖర్చు చేసే ప్రతి రూపాయి విలువైనదేనని చెప్పుకొచ్చారు. పెట్టే ఖర్చు, దానివల్ల అందే ప్రయోజనం ప్రజలకు ఉపయోగపడే లా క్షేత్రస్థాయి సిబ్బంది పని చేయాలన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు, సౌకర్యాల కల్పన మీద దృష్టిపెట్టామని పవన్ వెల్లడించారు. మొదటి విడత పల్లె పండుగ కార్యక్రమం కింద రూ.2,500 కోట్లు, పల్లె పండుగ 2.0 కింద రూ.5,700 కోట్లు ఖర్చు చేసినట్లు పవన్ చెప్పుకొచ్చారు. గిరిజన ప్రాంతాల్లో సౌకర్యాలను మెరుగు పర్చే కార్యక్రమం 'అడవి తల్లి బాట' పథకం కిం రూ.1005 కోట్లను వెచ్చించామన్నారు. దీంతో పాటు సాస్కీ నిధులు రూ.2,123 వేల కోట్లతో నియోజక వర్గాల్లో ప్రాధాన్యతను బట్టి పనులు చేస్తున్నామని చెప్పారు. అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులతో పనులను క్రమపద్ధతిలో చేస్తున్నా మని వివరించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల అమలు, పనుల పూర్తి విషయంలో క్షేత్రస్థాయిలో కొన్ని ఇబ్బందులు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. కొన్ని ఫిర్యాదులు అందుతున్ నాయని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ నిర్ణయాల అమలు, పనులు జరుగుతున్న తీరు విషయంలో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే కొన్ని లోపాలు కనిపిస్తున్నాయని చెప్పిన పవన్... దీనిని అధిగమించా లని స్పష్టం చేశారు.



## రైళ్లలో ఇ-ప్యాంట్రీ సౌకర్యం

ఢిల్లీ, ఫిబ్రవరి 9: ప్రయాణికుల సౌకర్యార్థం భారతీయ రైల్వే కొత్త సదుపాయం తీసుకొచ్చింది. రైళ్లో ఫుడ్ ఆర్డర్ చేసేందుకు ఇ-ప్యాంట్రీ సదుపాయాన్ని ఐఆర్సీటీసీ ప్రవేశపెట్టింది. తొలుత వివేక్ ఎక్స్ప్రెస్లో ఈ సేవలను ప్రారంభించగా.. 25 మెయిల్/ఎక్స్ప్రెస్ రైళ్లలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్యాంట్రీ కారు కలిగిన ఎంపిక చేసిన రైళ్లలో ఈ సేవలను పొందొచ్చు.కన్ఫమ్ టికెట్, ఆర్ఏసీ, పాక్షికంగా టికెట్ కన్ఫమ్ అయిన ప్రయాణికులు ఇ-ప్యాంట్రీ ద్వారా ప్రీ ఆర్డర్ చేసుకోవచ్చు. ప్యాంట్రీ కార్ స్టాఫ్ సీటు దగ్గరకే ఆహారాన్ని డెలివరీ చేస్తారు. ఐఆర్సీటీసీ వెబ్సైట్ లేదా యాప్లో 'బుక్డ్ టికెట్ హిస్టరీ' సెక్షన్లో ఇ-ప్యాంట్రీ మీల్ ఆప్షన్ కనిపిస్తుంది. మీల్ బుక్ చేసుకున్నాక మీల్ వెరిఫికేషన్ కోడ్ వస్తుంది. దాన్ని డెలివరీ సమయంలో చూపించాలి. విశాఖ నుంచి వెళ్లే ఏపీ ఎక్స్ప్రెస్ కూడా ఈ జాబితాలో ఉంది. దశలవారీగా మిగిలిన రైళ్లకూ విస్తరించనున్నారు.కీ ఫీచర్లు: ఇ- ప్యాంట్రీ ద్వారా స్టాండర్డ్ లేదా రైల్నీర్ను బుక్ చేసుకోవచ్చు. ట్రైన్ ఎక్కాక ఆహారం కోసం ఆలోచన చేయాల్సిన అవసరం తప్పుతుంది. డిజిటల్ మోడ్లో చెల్లింపులు చేయొచ్చు. ఆన్లైన్లో మీరు ఫుడ్ బుక్ చేసుకోగానే మీకు మీల్ వెరిఫికేషన్ కోడ్ అందుతుంది. మీల్ ఆర్డర్ నుంచి డెలివరీ వరకు ట్రాకింగ్ ఉంటుంది. ఏదైనా కారణంతో ఫుడ్ డెలివరీ అవ్వకపోతే ఆ సమాచారం కూడా ఎస్సెమ్మెస్/ ఇ-మెయిల్ ద్వారా సమాచారం వస్తుంది.

## ఇప్పటి వరకే రూ.11.83 కోట్లు

హైదరాబాద్, మనం ప్రతినిధి: మేడారం సమ్మక్క సారక్క జాతరకు సంబంధించిన హుండీల లెక్కింపు కొనసాగుతోంది. సోమవారంతో హుండీల లెక్కింపు ఐదో రోజుకు చేరుకుంది. అయితే, ఇప్పటి వరకు 788 హుండీలను లెక్కించగా రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఒక్కరోజే 163 హుండీలను లెక్కించగా మరో రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరింది. మిగిలిన హుండీల లెక్కింపునకు సుమారు రెండు రోజులు పట్టవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, మంత్రి కొండా సురేఖ గత గురువారం కొబ్బరికాయ కొట్టి హుండీల లెక్కింపును ప్రారంభించారు. క్రితంసారి మేడారం జాతర ద్వారా రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో లెక్కిస్తున్నారు. హుండీల లెక్కింపు పూర్తయ్యాక బంగారం, వెండి వస్తువుల విలువను నిర్ధారిస్తారు.

## కొమురంభీం జిల్లాలో మావోల కదలికలు
### రంగంలోకి పోలీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 9: జిల్లాలోని తిర్యాణి మండలం పంగిడిమాదారం అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు కూంబింగ్ నిర్వహించారు. గ్రేహౌండ్స్ బలగాలు ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి మావోయిస్టుల సామగ్రిని గుర్తించాయి. అయితే పోలీసుల సమాచారం ముందుగానే తెలుసుకున్న మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయినట్లు సమాచారం. ఘటనా స్థలిలో మావోలు ఉపయోగించిన వంటపాత్రలు, ఇతర సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ ప్రాంతంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో ఎలాంటి అనుమానాస్పద కదలికలు గమనించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరుతున్నారు. మావోయిస్టుల కదలికలతో జిల్లాలో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి.

కాగా, గత ఏడాది డిసెంబర్లో జిల్లాలోని పెడల్దోబా గ్రామంలో 16 మంది మావోయిస్టులను పోలీసులు



అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా కొమురంభీం ఆసిఫాబాద్ - మంచిర్యాల డివిజనల్ కమిటీ సెక్రటరీ ఎర్రగొల్ల రవి అలియాస్ సంతోష్ సహ 41 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారు.

## భారత వృద్ధి 6.4 శాతం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని మూడీస్ పేర్కొంది. ఇదే సమయంలో ఈ గిరాకీ కొనసాగడంలో ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయి. గతేడాది ఆఖరులో వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) పన్ను రేట్లను తగ్గించడం, అంతకుముందు యూనియన్ బడ్జెట్లో వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితులను పెంచడం, తద్వారా ప్రజలు ఖర్చు చేయడం వల్ల వృద్ధి మరింత వేగవంతంగా మారిందని మూడీస్ వివరించింది. ఇదే సమయంలో దేశ బ్యాంకింగ్ వ్యవస్థ గురించి ప్రస్తావించిన మూడీస్, దేశీయ బ్యాంకింగ్ రంగం స్థిరంగా, సమర్థవంతంగా కొనసాగుతోంది.

## స్పీకర్పై విపక్షాల అవిశ్వాసం!

(మొదటి పేజీ తరువాయి)


వేచిచూడాలని పేర్కొంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రసంగించేందుకు విపక్ష నేత రాహుల్ గాంధీని స్పీకర్ అనుమతించలేదని ప్రతిపక్షాల ప్రధాన ఆరోపణ. ఇక, కాంగ్రెస్ ఎంపీలు, మహిళా నేతలను కించపరిచేలా మాట్లాడిన భాజపా ఎంపీ నిషికాంత్ దూబేపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకే ఈ అవిశ్వాస తీర్మానం తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది.

ఈ తీర్మానం తీసుకురావాలంటే కనీసం 100 మంది ఎంపీల సంతకాలు అవసరం. ప్రస్తుతం విపక్షాలు ఆ సంతకాల సేకరణలో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన సమావేశంలో అవిశ్వాస తీర్మానంపై నిర్ణయం తీసుకున్నట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో టీఎంసీ, డీఎంకే, వామపక్షాలు, సమాజ్ వాదీ పార్టీ, ఆర్జేడీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ) తదితర పార్టీలు పాల్గొన్నట్లు తెలిపాయి. మరోవైపు, పార్లమెంట్లో సోమవారం కూడా సభ కార్యకలాపాలకు ఆటంకం కలిగింది. విపక్షాల నిరసనలతో లోక్ సభ పలుమార్లు వాయిదా పడింది. అటు రాజ్యసభలో ఖర్గే ప్రసంగానికి అనుమతి లభించకపోవడంతో విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశారు.



## ఇది ఘోర అపచారం..
## ధర్మ విరుద్ధం
### శ్రీవారి లడ్డూపై బాబుకు పెద్ద జీయర్ లేఖ

తిరుపతి, ఫిబ్రవరి 9: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగం.. కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బ తీసిందని శ్రీవారి ఆలయ పెద్ద జీయర్ స్వామిజీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంపై పెద్ద జీయ్యర్ సోమవారం స్పందిస్తూ.. సీఎం చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. శ్రీవారికి నివేదించే అన్న ప్రసాదాలు, లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించినట్లు దర్యాప్తు అధికారులు నిర్ధారించడం తమను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఇది ఘోర అపచారం.. ధర్మ విరుద్ధం.. అత్యంత బాధ్యతారహితమైన చర్య' అని పెద్ద జీయర్ స్వామి అభివర్ణించారు. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని శ్రీవారి భక్తుడైన సీఎం చంద్రబాబుకు ఆయన సూచించారు. 'ధర్మాన్ని పరిరక్షించడంతో పాటు ఆలయాల పవిత్రతను కాపాడే శక్తిని మీకు ఆ దేవుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను' అని పెద్ద జీయర్ తన లేఖలో రాశారు.



## ఆన్లైన్ గేమింగ్ ఆటకట్టు

- రూ.5వేల కోట్ల నెట్వర్క్ ఛేదించిన జీఎస్టీ ఇంటెలిజెన్స్
- దుబాయ్ కేంద్రంగా రాకెట్
- హవాలా మార్గంలో నిధుల మళ్లింపు
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- రంగంలోకి దిగనున్న ఈడీ





హైదరాబాద్,ఫిబ్రవరి 9(మనం,ప్రత్యేక ప్రతినిధి): దేశవ్యాప్తంగా విస్తరించిన సుమారు రూ.5 వేల కోట్ల విలువైన ఆన్లైన్ గేమింగ్ నెట్వర్క్ను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) హైదరాబాద్ అధికారులు ఛేదించారు.ఈ నేపథ్యంలో అన్ లైన్ గేమింగ్ రాకెట్ పై దాడులు చేపట్టి ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్, ఢిల్లీ, ముంబై నగరాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తనిఖీలలో కీలక ఆధారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, బ్యాంక్ లావాదేవీల వివరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పన్ను ఎగవేత, అక్రమ లావాదేవీలు, హవాలా మార్గాల ద్వారా డబ్బు మార్పిడి వంటి ఆరోపణలపై విస్తృత స్థాయిలో దర్యాప్తు చేట్టిన అధికారులు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. కాగా నిందితులిద్దరూ ముంబైకి చెందిన వైఎస్ ప్రభు కుమార్, హైదరాబాద్కు చెందిన రాజ శేఖర్ రెడ్డిగా గుర్తించారు. వీగోఫిన్ డిజిటల్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్గా ప్రభు కుమార్ వ్యవహరిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది.

### బ్యాంకులకు టోకరా:

ఆన్లైన్ గేమింగ్ స్కాంలో రూ. 5 వేల కోట్ల రూపాయల పన్ను ఎగ్గొట్టిన నిందితులు నిధులను దుబాయ్కి మళ్లించినట్లు విచారణలో తేలిందితేలింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు బ్యాంకులకే టోకరా వేశారని, ఓటీపీ లేకుండానే 5 వేల కోట్లు నిధుల బదలాయింపు జరిపారని అధికారులు చెబుతున్నారు. దుబాయ్ కేంద్రంగా 'మాస్టర్ మైండ్' కొనసాగిందని, అయితే హైదరాబాద్లో తీగ లాగితే ఆన్లైన్ గేమింగ్ డొంక కదిలిందని వివరించారు.నిబంధనలకు విరుద్ధంగా రియల్ మనీ గేమింగ్.. జీఎస్టీ ఎగ్గొట్టేందుకు ఎస్క్రో ఖాతాల వినియోగించినట్లు డీజీజీఐ తెలిపింది.ఈ రాకెట్లో హైదరాబాద్ నగరానికి చెందిన రాజ శేఖర్ కీలక పాత్ర పోషించినట్లు అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు. విదేశీ సర్వర్లు, షెల్ కంపెనీలు, ఫేక్ అకౌంట్ల ద్వారా భారీ స్థాయిలో బెట్టింగ్ గేమింగ్ కార్యకలాపాలు నిర్వహించినట్లు ప్రాథమికం విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. జీఎస్టీ చట్టాల ఉల్లంఘనతో పాటు ఈ వ్యవహారంపై ఈడీ అధికారులు మనీ లాండరింగ్ కోణంలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ స్కాంకు సంబంధించి కీలక వ్యక్తులపై నిఘా కొనసాగుతోందని, అన్లైన్ గేమింగ్ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు స్పష్టం చేశారు.

### దుబాయ్ కేంద్రంగా:

ఈ కేసులో ప్రధాన నిందితుడు దుబాయ్ కేంద్రంగా నెట్వర్క్ నిర్వహించినట్లు డీజీజీఐ గుర్తించింది. ఆన్లైన్ గేమింగ్ పేరుతో డొల్ల కంపెనీలతో కోట్లాది రూపాయల మళ్లింపు చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఓషియానిక్ వెబ్ సొల్యూషన్స్, వెబ్విన్ సొల్యూషన్స్ అనే నకిలీ షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లించారని, అలాగే ఫన్ఇన్ మ్యాచ్ 360,రేస్జి-ఇటి 247 వెబ్సైట్ల ద్వారా అక్రమాలు చేసినట్లు విచారణలో వెలుగుచూసింది. అలాగే బ్యాంకింగ్ ఏపీఐలను దుర్వినియోగం చేసిన నిందితులు ఈ స్కాం ఆడిట్కు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తేలిందని అధికారులు వివరించారు.

# క్రీడలతో ఒత్తిళ్లను అధిగమించవచ్చు

- టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి
- ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీల ప్రారంభం




**తిరుపతి, ఫిబ్రవరి 09, మనం న్యూస్ :** శ్రీవారి దర్శనార్థం లక్షలాది భక్తులకు నిత్యం విశేష సేవలు అందిస్తున్న టిటిడి ఉద్యోగులు ఎదుర్కొనే మానసిక మరియు పనిఒత్తిడులను క్రీడల ద్వారా సమర్థంగా అధిగమించవచ్చని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. టిటిడి ఉద్యోగుల వార్షిక క్రీడాపోటీలు సోమవారం తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని పరేడ్ మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఈవో, ఉద్యోగులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు ఉన్నతాధికారులతో కలిసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, బెలూన్లు మరియు శాంతి కపోతాలను ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిటిడి ఉద్యోగులు రోజువారీ జీవితంలో ఏదో ఒక క్రీడను అలవాటు చేసుకుంటే ఒత్తిళ్లను అధిగమించడంతో పాటు మరింత ఉత్సాహంతో, బాధ్యతతో విధులు నిర్వర్తించగలరని తెలిపారు. క్రీడలు జీవితం యొక్క భాగమైతే శారీరక ఆరోగ్యంతో పాటు ఉల్లాసం, సమయపాలన, ప్రణాళికా దృక్పథం, సానుకూల ఆలోచన, మంచి ప్రవర్తన, క్రమశిక్షణ, కార్యనిర్వహణ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, సంక్షోభ నిర్వహణ సామర్థ్యం మరియు అందరిని కలుపుకుని ముందుకు సాగే తత్వం అలవడతాయని చెప్పారు.

మన ఆలోచనలకు అనుగుణంగానే మన ప్రవర్తన ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, మానసిక వికాసం దృష్ట్యా 1977 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది ఉద్యోగుల క్రీడాపోటీలను నిర్వహిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగి రోజూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు.

అదనపు ఈవో వాలీబాల్ మ్యాచ్తో క్రీడాపోటీలను ప్రారంభించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక ప్రతిభావంతులు, సీనియర్ అధికారులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ క్రీడల్లో టగ్ ఆఫ్ వార్, చెస్, వాలీబాల్, క్యారమ్స్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్బాల్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, షటిల్, టెన్నిస్ తదితర అంశాలు ఉన్నాయి.

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా పీఆర్వో కుమారి నీలిమ వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ ఎ. ఆనంద రాజు, డిప్యూటీ ఈవోలు శ్రీమతి వి.ఆర్. శాంతి,సెల్వం,రాజేంద్ర కుమార్, సీపీఆర్వో డా. టి. రవి,గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్,ఇతర ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

**తిరుమల, ఫిబ్రవరి 9 (మనం న్యూస్) :** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.సోమవారం ఉదయం వీఐపీ విరామ సమయంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు,సినీ నటుడు తేజ సజ్జి,సినీనటి శ్రీ లీల వారి కుటుంబ సభ్యులు,సంగీత దర్శకుడు తమన్, గాయకులు శ్రీకృష్ణ, సాహితీ చాగంటి, శృతిరంజని, సాకేతి వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. సినీ ప్రముఖులను చూడటానికి ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఆసక్తి చూపించారు.



## వాలెంటైన్ వీక్ సర్ప్రైజ్ తో జర జాగ్రత్త

### వాలెంటెన్స్ స్పెషల్ అనగానే మెసేజ్లతో భద్రం

### పత్తికొండ రూలర్ సీఐ పులి శేఖర్ గౌడ్

**పత్తికొండ, ఫిబ్రవరి 09(మనం న్యూస్) :** వాలెంటైన్ వీక్ సర్ ప్రైజ్ తో మొబైల్ కి వచ్చే మెసేజ్ లతో జాగ్రత్తగా ఉండాలని పత్తికొండ రూలర్ సీఐ పులి శేఖర్ గౌడ్ అన్నారు. యువత వాలెంటెన్స్ మెసేజ్ లతో జాగ్రత్తగా ఉండండని స్పెషల్ గిఫ్ట్స్, గ్రీటింగ్స్ అంటూ సందేశాలలోని క్లిక్ చేయొద్దు అని అయన సూచించారు. ఎవరైనా సడన్ గా స్ప్రైజ్ అంటూ పంపించే క్యూఆర్ కోడ్స్ స్కాన్ చేయవద్దన్నారు. సైబర్ మోసగాళ్ల వలలో పడకుండగా యువత జాగ్రత్తగా ఉండాలని సీఐ పేర్కొన్నారు.ఏదైనా సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 టోల్-ఫ్రీ నంబర్కు కాల్ చేయండియని సూచించారు.

# ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ప్రీ-పెయిడ్ మీటర్లు

- ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి



**తిరుపతి, ఫిబ్రవరి 9 మనం న్యూస్ :** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ విద్యుత్ సర్వీసులకు ఇప్పటికే ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లకు ప్రీ-పెయిడ్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లతో సిఎండి శివశంకర్ లోతేటి సోమవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు ఆధునిక సాంకేతికతతో మరింత మెరుగైన సేవలతో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు స్మార్ట్ మీటర్లను ఆమర్చడం జరుగుతోందన్నారు. సంస్థ పరిధిలో కార్పొరేషన్/మున్సిపాలిటీలు, వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైట్స్, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఇప్పటివరకు నెల్లూరు జిల్లాలో 16,802, తిరుపతి 19,460, చిత్తూరు 13,871, అన్నమయ్య 13,311, కడప 16,829, అనంతపురం 8,136, శ్రీసత్యసాయి 6,717, కర్నూలు 10,457, నంద్యాల జిల్లాలో 9,836 సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఆమర్చినట్లు తెలిపారు.

ఈ సర్వీసులన్నింటినీ ప్రస్తుతం ప్రీ-పెయిడ్ మీటర్లుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రీ-పెయిడ్ మీటర్లకు రీఛార్జ్ చేసేందుకు వీలుగా ఈ-వాలెట్లను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ మీటర్ల ద్వారా వినియోగదారులు విద్యుత్తు వినియోగాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని, తదనుగుణంగా విద్యుత్తును ఆదా చేయడం ద్వారా బిల్లును కూడా తగ్గించుకోచ్చని తెలిపారు. అంతేకాకుండా విద్యుత్ వినియోగంపై వినియోగదారుల్లో జవాబుదారీతనం పెంపొందుతుందని తెలియజేశారు.

దశలవారీగా మిగిలిన కేగిరీల వినియోగదారులకు కూడా ప్రీ-పెయిడ్ స్మార్ట్ మీటర్లను అమర్చేందుకు చర్యలు చేపడుతామని వివరించారు. కాగా సోమవారం ఉదయం సంస్థ కార్పొరేట్ ఆఫీసులో నిర్వహించిన డయల్ యువర్ సిఎండి కార్యక్రమానికి 39 వినతులు అందాయని సంస్థ సీఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఈ సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (టెక్నికల్ హెచ్ఆర్డి) కే. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, ఆర్ పద్మ, జె రమణాదేవి, ఎం. ఉమాపతి, ఎం. మురళి కుమార్, ఎం. కృష్ణారెడ్డి, కే. సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, జనరల్ మేనేజర్లు సురేంద్ర రావు, జగదీష్ చక్రపాణి, లత తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతతోనే సరైన ఆర్థిక నిర్ణయాలు



- జిల్లా కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి, ఫిబ్రవరి 09 మనం న్యూస్ :** భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి 13 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సురక్షిత బ్యాంకింగ్ విధానాలు పాటించడం, డిజిటల్ లావాదేవీలను జాగ్రత్తగా నిర్వహించడం, పొదుపు అలవాట్లు పెంపొందించుకోవడం, ఆర్థిక మోసాల నుండి రక్షణ పొందడం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే ఈ వారోత్సవం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తనపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ సేవలు, బీమా, పెన్షన్ పథకాలు మరియు డిజిటల్ ఆర్థిక భద్రతపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ గుంటూరు రవి కుమార్, డీఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శోభన్ బాబు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



## తెర్నేకల్లో అన్నదాన కార్యక్రమం

**దేవనకొండ, ఫిబ్రవరి 9,( మనం న్యూస్ ) :** మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలో లోని శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి గుడి దగ్గర శివ స్వాములు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.జూ మరియు శివ స్వాములు శ్రీ శ్రీ రామలింగేశ్వర స్వామి కి విశేష పూజలు అందించి కుంకుమార్చన పలికారు. అలాగే గ్రామ ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తదితరులు గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# కల్తీ జరిగిందని కరుణాకర్ రెడ్డే ఒప్పుకున్నారు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి, ఫిబ్రవరి 9 మనం న్యూస్ :** కల్తీ నెయ్యికి పాల్పడిన వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులకు శ్రీవారు త్వరగా శిక్ష వేయాలని కోరుతూ ఆదివారం ర్యాలీ నిర్వహించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాల్లో కల్తీ నెయ్యి జరిగిందని ఎన్ డిడిబి, సిట్ నిర్ధారించాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పునరుద్ఘాటించారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. శ్రీవారి లడ్డు ప్రసాదాల్లో వినియోగించే నెయ్యి కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకుంటే కరుణాకర్ రెడ్డి జరగలేదని బొక్కుతున్నాడని ఆయన తెలిపారు. వీరిద్దరి అభిప్రాయాలను బేరీజు వేస్తూ నేను మాట్లాడిన మాటలను వైసీపీ నాయకులు, కొన్ని పత్రికలు వక్రీకరించారని ఆయన ఆరోపించారు. కల్తీ నెయ్యి పాపాత్ములకు మంచి బుద్ధి కలిగించాలని అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరి కాయలు కొట్టి శ్రీవారిని మొక్కామని ఆయన గుర్తు చేశారు. కరుణాకర్ రెడ్డి చెంచాలు పసుపు నీళ్లు చల్లినా, పొర్లు దండాలు పెట్టినా చేసిన పాతకం పోదని ఆయన అన్నారు. అయోధ్య కు పంపిన లడ్డూల తయారీకి హైదరాబాద్, పలమనేరు డైరీల నుంచి నెయ్యి తెప్పించినట్లు కరుణాకర్ రెడ్డి, పేర్ని నానీలు చెప్పారని ఆయా న గుర్తు చేశారు. అంటే మిగిలిన లడ్డూల్ని కల్తీ నెయ్యి తో చేసినట్లు కరుణాకర్ అంగీకరించారని ఆయన చెప్పారు. కరుణాకర్ రెడ్డి ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకుని నిజం ఒప్పుకుని హిందువులకు ముఖ్యంగా శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా కరుణాకర్ రెడ్డి గోబెల్స్ తరహాలో



పదే పదే అబద్ధాలు చెబితే నిజమవుతుందనే భ్రమలో ఉన్నారని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఎన్ డిడిబి, సిట్ నెయ్యి కల్తీ జరిగిందని నివేదికలు ఇచ్చాయని ఆయన గుర్తు చేశారు. ఆదివారం జనసేన నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే వ్యాఖ్యలను

వైసీపీ పాంప్లెట్ సాక్షి వక్రీకరించిందని ఆయన తెలిపారు. సాక్షిపై న్యాయ పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రెస్ మీట్ లో జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ సీఎండీకి విశేష స్పందన

### ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

### డయల్ యువర్ సి ఎం డి కార్యక్రమానికి విశేష స్పందన

**కాకినాడ, ఫిబ్రవరి 9,మనం ప్రతినిధి :** విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రారంభించిన డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని



సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 48 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు.

ఇందులో ప్రధానంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటులో ఇబ్బందులు, ట్రాన్స్ఫార్మర్ల మార్పిడిలో జాప్యం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఎస్టిమేషన్లు, విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ బిల్లులు, విద్యుత్ లైన్లు స్తంభాల మార్పిడి, విద్యుత్ స్తంభాలపై వైర్లు వేలాడుతుండడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేంత వరకు కార్పొరేట్ కార్యాలయ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు 9493681912 కు చాట్ చేయడం ద్వారా కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాష్, టి.వనజ, ఎస్.హరిబాబు, సీజీఎం వి.విజయలలిత, జీఎం ఎం.ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

## వెట్టి చాకిరి లేని సమాజానికి భాగస్వాములు కావాలి

### తహసిల్దార్ త్రివేణి

**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 9, మనం న్యూస్ :** వెట్టి చాకిరి వ్యవస్థ ఒక సామాజిక దుష్ప్రభావామని, దానిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని డుంబ్రిగుడ తహసిల్దార్ త్రివేణి అన్నారు. వెట్టి చాకిరి వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలోమండల కేంద్రంలోని వెట్టి చాకిరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి అవగాహన పరిచారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెట్టి చాకిరి వ్యవస్థ చట్టం 1976 అమలులోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ర్యాలీ ద్వారా అవగాహన పరుస్తున్నమన్నారు. ఎవరైనా వ్యక్తులను బలవంతంగా పనిలో ఉంచుకోవడం లేదా తక్కువ వేతనంతో వెట్టి చాకిరి చేయించుకోవడం చట్టరీత్య నేరమని చెప్పారు. ఎక్కడైనా వెట్టి కార్మికులు ఉన్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే కార్మిక శాఖకు లేదా జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలని కోరారు. విముక్తి పొందిన కార్మికులకు కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, పునరవాస పథకాలు అమలు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ సాగర్ ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోద్రేజ్ ఆగ్రోవెట్ నుంచి కొత్త కీటక నాశిని టకాయ్ విడుదల

**రాజమండ్రి ఫిబ్రవరి 09, మనం న్యూస్ :** భారత్లోని ప్రముఖ వైవిధ్యభరితమైన అగ్రి బిజినెస్ సంస్థలలో ఒకటైన గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (గోద్రేజ్ ఆగ్రోవెట్), వరి పంట కోసం అభివృద్ధి చేసిన సరికొత్త కీటక నాశిని టకాయ్ ని విడుదల చేసింది. జపాన్కు చెందిన ఐఎస్కె సంస్థ అభివృద్ధి చేసిన సైక్లాప్రిన్ టెక్నాలజీతో రూపొందిన టకాయ్, వరిలోని ప్రధాన తెగుళ్లైన కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగులపై సమర్థవంతంగా పనిచేస్తుంది. దీనిని నాట్లు వేసిన 15 నుంచి 30 రోజుల తర్వాత ఒకసారి, మళ్లీ 40 నుంచి 60 రోజుల తర్వాత 160 మి.లీ మోతాదులో వాడితే, వరి పంటకు సుదీర్ఘ కాలం పాటు రక్షణ లభిస్తుందని గోద్రేజ్ ఆగ్రోవెట్ ప్రతినిధి సునీల్ కటారియా చెప్పారు.

మొక్కజొన్న, మిరప, క్యాబేజీ, సోయాబీన్, శనగ మరియు చెరకు పంటలలో కూడా టకాయ్ వినియోగానికి సంబంధించి లేబుల్ అనుమతులు పొందే ప్రక్రియలో కంపెనీ ఉందన్నారు.

తీవ్రస్థాయిలో కాండం తొలిచే పురుగు ఆశించినప్పుడు 30 శాతం నుండి 40 శాతం వరకు దిగుబడి నష్టం వాటిల్లుతుందని, అదేవిధంగా ఆకు ముడత పురుగు ఉధృతి వల్ల 20 శాతం నుండి 30 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ఇవి తరచూ పంట ప్రారంభ మరియు మధ్య దశలలో దాడి చేస్తాయి, ఆ సమయంలో వీటిని గుర్తించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టడం సవాలుతో కూడుకున్న పని. ఈ కారణాల వల్ల, భారత్ 150.18 మిలియన్ టన్నుల ఉత్పత్తితో ప్రపంచంలోనే అతిపెద్ద వరి ఉత్పత్తిదారుగా ఉన్నప్పటికీ, హెక్టారుకు సగటు దిగుబడి మాత్రం 2.9 టన్నుల వద్దే తక్కువగా ఉందన్నారు. ఇది ప్రపంచ అత్యుత్తమ దిగుబడి అయిన 5 టన్నులు/హెక్టారుతో పోలిస్తే చాలా తక్కువ అన్నారు. 'భారతీయ వరి రైతు విజయం అనేది సమర్థవంతమైన తెగుళ్ల నివారణపైనే ఆధారపడి ఉంటుంది. టకాయ్ ద్వారా మేము వరి రైతులకు తమ పంటలను తెగుళ్ల నుండి రక్షించుకునేలా చేయడమే కాకుండా, వేగవంతమైన నియంత్రణను, సుదీర్ఘ కాలం పాటు పని చేసే పరిష్కారాన్ని అందిస్తున్నాం అని, తద్వారా పంట ఆరోగ్యం మెరుగుపడుతుంది' అని తెలిపారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ వద్ద మా లక్ష్యం, మన రైతులు ఎదుర్కొంటున్న పర్యావరణ మరియు మార్కెట్ సవాళ్లను పరిష్కరించే పంట రక్షణ మార్గాలను అందించడం అని, టకాయ్ లాంచ్ మా వ్యూహానికి అనుగుణంగా ఉంది. మా పరిశోధన నైపుణ్యం, క్షేత్రస్థాయిలో మాకున్న పటిష్టమైన నెట్వర్క్ ద్వారా కీలకమైన పంటల విషయంలో మా పోర్ట్ఫోలియోను బలోపేతం చేస్తున్నాం అన్నారు. ఇది రైతులకు సాధికారతనివ్వడమే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తుంది' అని వివరించారు.

## మాటల సునామీ..!

మైకు ఊపిరి ఆగిపోయేంత
బూతు పురణాల గందరగోళం
చెవులు రెక్కలు విరిగి పడిపోయేలా
మాటకు మాటతో సమాధానం
ఎద్దేవాలతోనే పొద్దు పుడుతోంది
సర్దుకోడాలకే ఐదేళ్ళు గడిచిపోతోంది

నాలికలు నాగుపాములై లేస్తూ
విషపు మాటలు చిమ్ముకుంటూ
తర్వాత రాతలు రాసుకునే
ఎబ్బెట్టు కాలం వచ్చేసింది
సమన్వయానికి ఆయువు తీరిపోయి
సమస్యలకు దీర్ఘాయువు పట్టింది

నోటికొచ్చిన కూతతో తెల్లారిపోతుంటే
రోజులు మాత్రం పరుగుదీస్తున్నాయి
ప్రారంభోత్సవాలకే కాలం సరిపోలేదని
సామాన్య జనం నవ్వుల్ని రాజేసుకుంది
బూతులు బాబోయ్ బూతులంటూ
దూదెట్టుకున్న చెవులతో
మూతికి మైకు అనించే స్థితి వచ్చేసింది

గాలి కొట్లాటల తోపులాట్లకే సమయం
కళ్లెం ఊడిన గుర్రమై పరుగులు పెడుతుంటే
ప్రజల బాధల్ని మోయలేని ఖాళీ బండిలా
నేటి ఏలిక వెనక్కి చూడని ఉరుకుడైంది
కసురుకోడాలు విసురుకోడాలతోనే
సంవత్సరాల కాలం ఆవిరైపోతోంది

వల్లించే ఆవేశాల బూతు పొంగులతో
మాట విలువకు ఎప్పుడో గండి పడింది
వ్యక్తిత్వ దూషణలతోనే కాలం కరుగుతుంటే
సమసమాజ స్థాపన సేద తీరడం మొదలైంది
హద్దు చెరిపేసి మాటల అగ్గి రాజేస్తూ
రోజుల్ని తోచుకుంటూ వెళ్ళిపోతే
అజెండా కన్నీరు కారుస్తూ కూర్చుంటుంది
జెండా సిగ్గుతో ముడుచుకుపోతుంది

- నరెద్దుల రాజారెడ్డి
9666016636

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**- ఎడిటర్**

# పట్టణ పీఠాల కోసం త్రిముఖ సమరం



ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టణ,నగర పాలక(స్థానిక సంస్థల)ఎన్నికలు ప్రజల జీవన ప్రమాణాలను నేరుగా ప్రభావితం చేసేఅత్యంత కీలక ఘట్టాలు. ఈ పాలకవర్గాలు ప్రజల దైనందిన అవసరాలు-తాగునీరు, పారిశుధ్యం, రహ దారులు,విద్యుత్,కాలుష్య రహిత పట్టణ,నగరాల అభివృద్ధి- తదితరాలన్నీ స్థానిక పాలనతోనే ముడిపడి ఉంటాయి.



ఇలాంటి నేపథ్యంలో మన రాష్ట్రంలో ఫిబ్రవరి 11న జరగనున్న పుర(నగర)పాలక ఎన్నికలు రాజకీయంగానే కాదు, సామాజికంగా కూడా విశేష ప్రాధాన్యం సంతరించు కున్నాయి.ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 7 నగరపాలక సంస్థలకు,116 పుర పాలక సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి.ఎన్నికల తేదీ సమీ పిస్తున్న కొద్దీ ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ఉద్ధృతం చేశాయి. విమర్శలు-ప్రతివిమర్శలతో పట్టణ రాజకీయ వాతా వరణం వేడెక్కుతోంది. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరుగుతున్నం దున,అన్ని రాజకీయ పార్టీలు ఈ పోరును ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఆధిపత్యం కోసం పోటీపడు తున్నాయి. అగ్రనేతలను రంగంలోకి దించి,బహిరంగ సభలు, రోడ్షోలు, సమావేశాలతో పట్టణాలన్నీ రాజకీయ-ఎన్నికల రంగస్థలాలుగా మారాయి.

**ప్రతిష్టాత్మక పోరులో అధికార-ప్రతిపక్షాల వ్యూహాలు**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీగా కాంగ్రెస్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అన్ని నగరపాలక సంస్థలు, అధిక శాతం పురపాలక సంఘాలను దక్కించు కోవడ మే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తూ ప్రజల ముందుకెళ్తుంది. లోక్ సభ నియోజకవర్గాల వారీగా మంత్రులకు ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగించి, పార్టీని సంఘటితంగా ముందుకు నడిపిస్తున్నారు.

గత రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అలాగే వచ్చే మూడేళ్లలో అమలు చేయ బోయే ప్రణాళికలను ప్రజలకు వివరించడం కాంగ్రెస్ ప్రచా రంలో ప్రధాన అస్త్రంగా మారింది.అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన నిధులు అందక పోవడాన్ని ప్రస్తావిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను గుర్తుచేస్తూ ప్రచారం కొనసాగిస్తోంది. అభివృద్ధి కావాలంటే స్థానిక సంస్థలలోనూ కాంగ్రెస్‌కే అధికారం ఇవ్వాలి అన్న నినాదంతో ముందుకు వెళ్తోంది.

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ, తెలంగాణలో జరుగుతున్న ఈ అర్బన్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఏడు నగరపాలక సంస్థలలో మూడు చోట్ల బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహించడం ఈ పార్టీకి అదనపు బలంగా మారింది. నిజామాబాద్‌లో ఎంపీతో పాటు ఎమ్మెల్యే ఉండగా, కరీంనగర్ నుంచి కేంద్రమంత్రి, మహబూబ్‌నగర్‌లో జాతీయ అధ్యక్షుడితో పాటు కేంద్ర మంత్రులు, రాష్ట్ర నాయకత్వం ప్రచా రంలో పాల్గొంటూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలనే ప్రధాన అస్త్రంగా చేసుకున్నారు. నెరవేరని హామీలు, మోసపూరిత వాగ్దానాలంటూ కాంగ్రెస్పై విమర్శలు ఎక్కుపెట్టడంతో పాటు, బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌ను చీల్చే ప్రయత్నాలు కూడా సాగిస్తున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ప్రతిపక్షంగా ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గత పదేళ్ల పాలనలో తాము చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలనే ప్రధాన ఆయుధంగా ప్రచారం చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఇచ్చిన హామీలు అమలు కాలేదని, ప్రజలు నిరాశ చెందుతున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. నగరపాలక,పురపాలక సంఘాల వారీగా ఇన్‌చార్జ్‌లను నియమించి, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయ కులు ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్నారు. పార్టీ ప్రధాన నేతలు వ్యూహాత్మక దిశానిర్దేశం చేస్తూ,ఎక్కువ స్థానాలు దక్కించుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల మధ్య ఉన్న విభేదాలు, అలాగే గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన పనులు ప్రజలకు ఇంకా గుర్తున్నా యన్న నమ్మకంతో ఈ ప్రభావం ఫలితాలపై పడుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు.

ఇదిలా వుండగా గణాంకాలు,ధనం-యువత-మహిళల ప్రభావం రాష్ట్రంలో ఏడు నగరపాలక సంస్థలు, 116 పుర పాలక సంఘాల ఎన్నికల్లో మొత్తం-12,944 (ఏకగ్రీవలతోకలిపి) మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఎన్నికల్లో పార్టీల వారీగా పోటీ చేస్తున్న స్థానాలు గమనిస్తే రాజకీయ ఉత్సాహం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. కాంగ్రెస్:2,948 స్థానాలు (98.3%), బీఆర్ఎస్:2,878 స్థానాల(96%), బీజేపీ: 2,634 స్థానాలు (87.3%), స్వతంత్రులు: 2,786 స్థానాలు (94%), జనసేన:332(11.1%),మజ్లిస్:282(9.4%),ఆల్ఇండియా ఫార్వర్డ్ బ్లాక్:288(11.1%),బీఎస్పీ:213(7.1%), సీపీఐ: 168 (5.6%),సీపీఎం:108(4.2%),: ఐయూ ఎంఎల్:9 (0.3%). 7 ఏడు కార్పోరేషన్ల పరిధిలో 414 డివిజన్ ఉండగా2,225 మంది పోటీలో ఉన్నారు. పురపాలికల వారీగా చూస్తే 116లో-10,719 మంది పోటీ చేస్తున్నారు.

ఈ గణాంకాలు పట్టణ,నగర రాజకీయాల్లో ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రుల ప్రభావం కూడా గణనీయంగా ఉందని స్పష్టం చేస్తున్నాయి.శ్రీమంతుల ఆధిపత్యం-ఖర్చుతో కూడిన రాజకీ యాలు పుర(నగర)పాలక పోరులో మరో ముఖ్యమైన అంశం-ధనం ప్రభావం. గతంలో ప్రజాసేవ చేయాలన్న భావనతో సామాన్యులు, సామాజిక కార్యకర్తలు రాజకీయాల్లోకి వచ్చేవారు. కానీ ప్రస్తుతం ఎన్నికలు ఖర్చుతో కూడిన వ్యవహారంగా మారడంతో, సమాజంపై అవగాహన, సేవాభావన ఉన్న చాలా మంది పోటీకి వెనుకడుగు వేస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో ప్రధాన పార్టీలు ఆర్థికంగా బలమైన శ్రీమంతులకు, వ్యాపారవేత్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నా యన్నది నిర్వివాదాంశం. వ్యాపారాలు, మైనింగ్, కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఉన్నవారు పెద్ద సంఖ్యలో రాజకీయా ల్లోకి వస్తున్నారు. కొన్నిచోట్ల పార్టీ టికెట్లు దక్కకపోయినా, స్వతంత్రులుగా బరిలోకి దిగినరు.

వార్డు కౌన్సిలర్ పదవికన్నా, భవిష్యత్తులో చైర్మన్,అధ్యక్ష స్థానా లపై కన్నేసిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారు.ఈ పోటీతో ఎన్నికల ఖర్చు క్రమంగా పెరుగుతూ,సామాన్యులకు అందని స్థాయికి చేరుతోంది.

యువత,మహిళల పాల్గొనడం- ఆశాజనక సంకేతం ఈసారి పుర(నగర)పాలక ఎన్నికల్లో యువ రక్తం పెద్ద ఎత్తున ముందుకొచ్చింది. మొత్తం12,944 మంది అభ్యర్థుల్లో 56.1 శాతం మంది 40 ఏళ్ల లోపు యువత ఉండటం విశేషం.వీరిలో దాదాపు70 శాతం మంది గ్రాడ్యుయేట్లు,అండర్ గ్రాడ్యుయేట్లు కావడం పట్టణ పాలనపై చదువుకున్న యువత ఆసక్తి పెరుగుతున్నదానికి నిదర్శనం.అలాగే మహిళల భాగస్వామ్యం కూడాగణనీయంగా ఉంది. మొత్తం పోటీదారుల్లో 6,508 మంది..(50.27%) మహిళా అభ్యర్థులు, 6,436 మంది (49.73%) పురుష అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అభ్యర్థుల విద్యార్హతలు చూస్తే - 775 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు, 2,903 మంది గ్రాడ్యుయేట్లు, 7,917 అండర్ గ్రాడ్యుయేట్లు, 1,291 మంది నిరక్షరాశులు, 58 మంది విద్యార్హతలు వెల్లడించని వారు ఉన్నారు.

పట్టణ భవిష్యత్తు ఓటర్ల బాధ్యతే ఈ ఎన్నికల్లో యువకులు, మహిళలు, శ్రీమంతులు,పోటీ చేసిన వారు తమ అదృష్టాన్ని పరీక్షించు కోబోతున్నారు.కానీ అసలు కీలక పాత్ర మాత్రం ఓటర్లదే.ప్రచార ఆర్భాటాలు, హామీల వర్షం, వ్యక్తిగత ప్రలో భాలకు లోనుకాకుండా,తమ నగరాల-పట్టణాల అభివృద్ధికి నిజంగా పని చేసే వారిని ఎంపిక చేయాల్సిన బాధ్యత ఓటర్ల పై ఉంది.నేటి ఓటు రేపటి ఐదేళ్ల పట్టణాల (నగరాల) అభివృద్ధికి తోడ్పడుతూ ప్రజలకు-సేవకులుగా,పాలకుల ఒప్పందం లాంటిదని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.మంచి నాయకత్వాన్ని ఎంచుకున్నప్పుడే పట్టణాలు,నగరాలు అభివృద్ధి చెందుతాయి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.అందుకే విచక్షణతో, స్వేచ్ఛగా మీ ఓటును వినియోగించండి.ప్రజా గెలుపే ప్రజాస్వామ్యానికి నిజమైన గెలుపు.

- మేకిరి దామోదర్
9573666650

# జంపు జిలానీలు



'గురువింద తన కింద మసివట్టిన' సంగతి మర్సినట్టు, గా దానం నాగేందర్ ముచ్చ ట్లింటే, పాపం గాయినకేం ముచ్చట జెప్పాల్నో సమఝైతున్నట్టు లేదు. పనుగడదీత్తె పసులు మందల్లెక్క ఉరికి ఉరికి యేరే దొడ్లె దుంకినట్లైంది కత. గా దుంకిన్దాంట్ల గీ దహనం ఒకలు. గీనే మొదటోడు గాడు సివ రాకరోడు సుత గాడు. మరి గిదేడ సురువైందంటే పాల్టీలు ఒగల కొగలు తూర్పార బట్టుడే. ఇగ గిది గుడ్డు ముందా!కోడి ముందా!! అన్నట్టు గుంటది. మునుపోకాయన మావోల్లను పది మందిని గుంజుకున్నడు, ఉపుడు మాకు మోకా దొరికింది,సెల్ గంపగుత్తగా మేంపాల్టి పాల్టీలనే బొంద వెడ్తం అనుకోని ఇరవై మందిని గుంజే. మల్ల సచ్చేదాంక నాదే రాజిర్కం అన్నట్టుజేసే. యెప్పుడూ ఒక్కలెక్కనే ఉంటదా?



ఓడలు బండ్లెతయి,బండ్లు ఓడలైతయిగదా! బస్ గంతే. ఓట్ల అంగట్ల రాజిర్కంబోయినంక నువ్వుజేసిందే నీకెదురైతె లబోదిబోమనుడు దప్పయింకేమన్నుంటదా?దుర్బిని వెట్టి ఎన్కులాడినా నీతీ,నియ్యతి మచ్చుకైనా అవుపించని దినాల్గదా! సిగ్గు,శరం అన్నీ యిడ్సిపెట్టిన మగానుబావులు గదా! ఇచ్చంత్రమేందంటే రాజిర్కం యెల్గబెట్టినపుడు పున్నమి సెంద్రున్లెక్క ఎలిగినోల్లు,పత్తరాలు కూకుండి తిన్నా ఒడువనంత సంపాదించినోల్లు, పెద్ద పెద్ద కుర్సీల్ల కూకొని సుకపడ్డోల్లు, మంతురులైనోల్లు, పానంబోయినా పాల్టీ ఇడ్సిపెట్టనని పెగ్గలు గొట్టినోల్లు, బెల్లం సుట్టు ఈగలు ముసిరినట్టు జనాలు ఓడగొట్టంగనే జంపుజిలానీల్లెక్క గోడ దూకిండ్లు. ఇండ్ల గా అసెంబ్లీల పెద్దమనిసిగ (స్పీకర్) జేసినాయిన సుత దూకుడు సానయిసిత్రం.

గీఆయారాం గయారాంల కత ఇయ్యాల్టది గాదు.2004 లోనే తెలుగు దేసంల గెలిసి, గమండితోని ఇస్తిఫా ఇచ్చి, మల్ల కాంగిరేసు నిషానతో పోటిజేస్తే జనాలు మస్త్ బుద్ది జెప్పి ఓడగొట్టి ఇంట్లకూకోవెట్టిండ్లు దానం నాగేందర్‌ని. ఇగ తెలంగాణ కోస్రం లడాయి మొదలైనంక ఉద్దెమ ఈరుల మీన కట్టెసాముజేసుకుంట మనోల్లను పొట్టుపొట్టు గొట్టినోల్లు ఎమ్మెల్యేలై,మంతురులై తెలంగాణ రోషంతోని పరాసికాలాడిండ్లు.పచ్చని సెట్టుమీన పచ్చులాలినట్టు ఇయ్యాల్ల మల్ల కాంగిరేసులజొచ్చిరు. గిదెట్లున్నదంటే లగ్గం ఒకలతోని,సంసారం ఇంకొకలతోని జేసినట్లని పిత్త లేదా? గంతేగాక అండ్లగా నాగేందరైతే బి.ఆర్.ఎస్. ఎమ్మెల్లే అనె సోయి లేకుండా 2024లో 'సెయ్యి' నిషాన మీన ఎం.పి గా సుత పోటీ జేసిండు.ఐనా గీనా పాల్టీ మారలేదని.బి.ఆర్.ఎస్.లనే ఉన్ననని, బి.ఆర్.ఎస్సోల్లే నన్ను అల్ల పాల్టీ అనుకుంటే లేరేమో! అనే లండు ముచ్చట్లన్ని జెప్పవట్టె 'సెప్పటోనికి సోయి లేకున్నా ఇనోటోనికైనా ఉండాలే గదా!' ఐనా ఓట్ల అంగట్ల పదెక్కువైనా ఇచ్చి కొంటామనే దైర్నం ఇచ్చింది ఓట్లేసేటోల్లేగదా!

యెవ్వడైనా పాల్టీ మారినట్లైతే సెప్పులు మెడకేసి,రాల్లతో కొట్టి సంపురని పచారం జేసిన ముక్యమంతిరి యేరే పాల్టీల గెల్సినోల్ల ఇండ్లల్లకువోయి గంట(కండువ)కట్టస్తే యెవల్ని రాల్లతో కొట్టాలే. నిత్తెం పజాసామ్యం, జన సర్కారు అని మొత్తుకునే పెద్దమనుషులు ఉపుడేంజెపుతరు. సేతుల అంబేడ్కర్ రాజ్జెంగంను సూపెడుతూ,దగాజేత్తరని జెప్పే రావుల్ గాంది కీ గిపుడు రాజ్జెంగం యాదికత లేదా!గిసొంటి జంపు జిలానీల తోటి సర్కార్లు ఊకూకే కూసైతున్నయనే గదా ఆల్ల నాయిన 1985లో పాల్టీ గోడ దుంకితే అల్ల పదవి పోతదనే సట్టం తెచ్చింది.కంసేకం మీ నాయిన మీన ఈసమెత్తు గౌరవం ఉన్న గిసొంటియి సైసద్దుగదా!

ఇగ'తాడిసెట్టు ఎందుకెక్కినవురా?అంటె దుడ్డె గడ్డి కోసం యెక్కిన అన్నడంట' యెన్కటికొకలు. పతోడు నా ఇలాకాలో సౌలతుల కోసం,మా జనాలు మంచి కోసం,మా జనాలకి యెండి గిన్నెల బువ్వవెట్టనీకీ అనే బవురూపుల ముచ్చట్లు చెప్తరు.అసలు కత యేరే,అది అందరికెరుకున్నదే. పనులు గుత్తవట్టనీకీ, పైసలు పోగెయ్య నీకీ,ఉన్నది జారకుండ జూసుకోనీకేనని తెల్సున్నదేగదా!

కలుపుకునేటోల్ల ముచ్చటసుత బలే గమ్మత్తుగా ఉంటాయ్.మా సర్కారు ఐదేండ్లు ఉండాలే గందుకనే,యెదుటోల్లు తక్వైతే మేం కొంచెం గట్టిగుంటం అంటారు. గందుకనే మా మందలకు తెచ్చుకున్న మంటరు. మరి మైకుల ముంగిట ఊకె పజాసామ్యం, మన్ను మసానమని సోది చెప్తారు గదా దాని సంగతేందంటే సప్పుడు జెయ్యరు.ఇంక జనాలు యెవ్వలను యెక్కడ కూకోవెట్టిన్రో అక్కడ కూసోవాలే గాని మందల్లెక్క కొంటే జనాల 'ఫైస్లా'ను నారాజు జేసినట్టుగాదా?

ఇగ ఇంకొన్ని పాల్టీలైతే మొదలే మాట్లాడుకొని, అల్లు ఓడిపోయిన తక్లీబ్ గాకుండా ముందుగానే సంచులు ముట్టజెప్పి గుండుగుత్తగా ఇస్తిఫా ఇప్పిచ్చి, మల్ల ఆల్ల పాల్టీ మీన పోటీజేపిత్తరు. గందుకనీ ఈల్లు రాజ్జెంగ రచ్చకులమని ఫోజులు గొడ్తరు. నీతి,నియ్యతి లేని గిసొంటి మనుసుల రాజిర్కంల రాజ్జెం యెట్లుంటది? ఇస్పీకర్లు సుత తాపతాపకు వాయిదాలేసుకుంట ఐదేండ్లు లాగిత్తరు. బస్.ఆల్ల కాలం ఒడ్సిపోతది.ఇగ బయమెట్లుంటది.యెవ్వలైతే జంపైతరో,యెంటనే అవుతలికి దొబ్బేత్తే జరంత బుగులువడి గోడ దూకుడు ఆగుతయి.గిట్ల కాకపోతే జంపైన ఆల్లమీన గా పెద్ద అదాలత్ ఆల్లకాల్లే (సుమోటోగా) కేసులు వెట్టి పదవి ఊడగొట్టాలే, లేకుంటే యెన్కకు(రికాల్) గుంజే తరీక జనాలకియ్యాలే.గట్లయితే జంపు జిలానీలు కట్టడైతరు.లేపోతే అంతే సంగతులు. అవునంటరా! కాదంటరా........!!

- మీస రాజమల్లయ్య
8491319904

## రష్యా, ఉక్రెయిన్ మంకు పట్టు వీడాల్సిందే

రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఫిబ్రవరి 22, 2022 లో ప్రారంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 22 కు నాలుగేళ్లు పూర్తి అవుతాయి. ఈ మధ్య కాలం లో రెండు దేశాలు తీవ్రంగానే నష్టపోయాయి. రష్యా కంటే ఉక్రెయిన్ భారీగా నష్ట పోయింది. ఉక్రెయిన్ లోని కొన్ని ప్రధానమైన నగరాలు రష్యా ధాటికి భారీగా నష్టపోయాయి. ఉక్రెయిన్ కు యుద్ధం మీదనే ఆసక్తి ఉంది. అభివృద్ధి, పౌరుల సంక్షేమ, అభ్యున్నతి ఏ మాత్రం లేదన్నది తెలుస్తోంది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఆపాలని ఎన్నో ప్రయత్నాలు చేసినా అవి ఒక కొలిక్కి రాలేదు.యుద్ధం ఆగాలని తాజాగా అబుదాభి లో ట్రంప్ నేత్రత్వంలో సాగే చర్చలు రెండిటికి ఒక శాంతి సందేశం ఉండే అవకాశం ఉంది.ఈ యుద్ధం ఆగాలని ట్రంప్ రెండు దేశాల పట్ల చర్చలు నడిపిన సందర్భాలు ఉన్నాయి. రెండు దేశాల మధ్య ప్రధాన అవరోధం 'డాన్ బాస్' వీడాలని రష్యా అంటోంది. అయితే అందుకు ఉక్రెయిన్ ససేమిరా అనట్లుగా ఉంది. 'డాన్ బాస్' ఒక పారిశ్రామిక నగరం అది ఎంతో అభివృద్ధి కూడా చెందింది. ఇది మా పరం చేయాలి అప్పుడే యుద్ధం ఆపుతామని రష్యా చెబుతోంది. అయితే ఉక్రెయిన్ అందుకు సుముఖంగా లేదు. మరి ట్రంప్ రాయభారం ఎలా ఫలిస్తుందో అంతు చిక్కడం లేదు. ఇప్పుడున్న పరిస్థితులను బట్టి చుస్తే యుద్ధం ఎంత మాత్రం ఏ దేశానికి తగదు. పోయిన ఏడాది డిసెంబర్ 25 న కూడా ఉక్రెయిన్ డ్రోన్‌ల దాడికి గురయింది.. కనుక ఉక్రెయిన్ ప్రజల కోసమైనా మంకు పట్టు వీడాలి. ట్రంప్ కూడా డాన్ బాస్ ను వదులు కొమ్మని చెప్పవచ్చు. దానికి ఉక్రెయిన్ సమ్మతించాలి. ఉక్రెయిన్‌లో భస్మీ పటలమైనా నగరాలకు రష్యా సహా యం చేయాలి. అందు లోను ఐక్యరాజ్య సమితి లోని భద్రతా మండలిలో అమెరికా, రష్యా శాశ్వత సభ్య దేశాలు. ముఖ్య సమాచారం పై రెండు దేశాలుపదే, పదే కలుస్తు వుంటా యి కూడా. ట్రంప్ ఇద్దరికీ ఆమోదయోగ్యమైన శాంతి చర్చలు జరుపు తాడని భావించవచ్చు. కనీసం అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యంగా పౌరుల కోసం ఇవి రెండు కలసి పోయి శాంతిని పూయిస్తే విశ్వం సంతోషిస్తుంది. ఈ ఏడాది జూన్ లోగా యుద్ధం పరిసమాప్తి కావాలని ట్రంప్ ఆలో చన గా ఉంది. అదే నిజమైతే ఈ రెండు దేశాలను ఐక్యం చేయడంలో నిజంగా డోనాల్ ట్రంప్ కృషి ఫలిస్తే ఆయన పేరు మారు మో గుతుంది. నిజమైన శాంతి నేతగా నిలుస్తాడు.

- కనుమ ఎల్లారెడ్డి
93915 23027

# కార్యకర్తలు కరివేపాకులా!

రాజకీయ పార్టీల మనుగడ వెనుక ఆపార్టీ కార్యకర్తల శ్రమ, త్యాగం ఆధారారపడి ఉన్నాయనేది నిర్వివాదఅంశం. అదే రాజకీయ పార్టీలు ఇటీవలి కాలంలో కార్యకర్తల పట్ల అనుసరిస్తున్న వైఖరి అవకాశవాదాన్ని బట్టబయలు చేస్తూ ఉండడం గమనార్హం. ముఖ్యంగా ఈ పరిణామం ప్రాంతీయ పార్టీలలో నూటికి నూరు శాతం కనిపిస్తూ ఉంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని రాజకీయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఈవిషయం సామాన్య మానవునికి సైతం సులభంగా అర్ధమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, వై.యస్.ఆర్. కాంగ్రెస్, జనసేన పార్టీలు, తెలంగాణాలో భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రధానంగా ప్రాంతీయ పార్టీలుగా మనుగడ సాగిస్తున్నాయి. 1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీ 22 సంవత్సరాల 302 రోజులు, 2001లో ఆవిర్భవించిన తెలంగాణా(భారత)రాష్ట్ర సమితి పార్టీ 9 సంవత్సరాల 187 రోజులు, 2011 లో ఆవిర్భవించిన వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ 5 సంవత్సరాలు అధికారం అనుభవించాయి. 2014లో ఆవిర్భవించిన జనసేన పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత 17 నెలల నుంచి ప్రధాన భాగస్వామిగా అధికారంలో ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి ఇంకా 3 సంవత్సరాలకు పైగా కచ్చితంగా అధికారంలో ఉంటాయి. కార్యకర్తల సమయం, డబ్బు, కుటుంబాల త్యాగ ఫలితంగానే ఈ విధంగా ప్రాంతీయ పార్టీలు అధికారాన్ని అనుభవిస్తూ సుధీర్ఘకాలం నుంచి మనుగడ సాగిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. కానీ కార్యకర్తలు చనిపోయినప్పుడు సంబందిత కుటుంబానికి పార్టీ తరపున ఇన్సూరెన్సు చెక్, కార్యకర్తకు లేదా వారి కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం కలిగితే వారికి సి.ఎం రిలీఫ్ ఫండ్ తప్ప కార్యకర్తలకు ఇతర లబ్ధి చేకూరుతున్నట్లు ఏమీ కనిపించడం లేదు. వాస్తవంగా రాజకీయ చదరంగంలో పావులుగా మారి చురుకుగా ఉండే కార్యకర్తలు అనేక మంది కేసులలో ఇరుక్కుంటున్నారు. వారిని పట్టించుకునే నాధుడేలేక వారు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. మరి కొంత మంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. రాజకీయ వైరంలో ప్రాణాలు కోల్పోయిన కార్యకర్త కుటుంబ సభ్యులను సంబందిత పార్టీ స్థానిక నాయకులు కలిసి తాత్కాలిక ఖర్చులకు కొద్దిగా డబ్బులు ఆ కుటుంబానికి ఇచ్చి పార్టీ మీకు అండగా ఉంటుందని సమయానుకూల హామీలు గుప్పిస్తారు. తరువాత ఎవరి దారి వారిదే. ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తల కుటుంబాలు మాత్రం రోడ్ల పాలే. కార్యకర్తలు తమ పార్టీలను అధికారంలోకి తీసుకు వచ్చేందుకు ప్రాణాలు సైతం పణంగా పెడుతున్నారు. కానీ రాజకీయ పార్టీలు అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉండడం గమనార్హం. అధికారంలో లేనప్పుడు కుటుంబ సభ్యులుగా, అధికారంలో ఉన్నప్పుడు అంటరాని వారుగా చూస్తూ కార్యకర్తల జీవితాలతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ పరిణామం అన్ని ప్రాంతీయ పార్టీలలో కనిపిస్తూ ఉంది. ప్రాంతీయ పార్టీలు అన్నీ వ్యక్తిగత పార్టీలు. అందువలన ఆ పార్టీలన్నీ వాటి అధినేతలైన ఏక వ్యక్తి నిర్ణయాలపైన ఆధారపడి వ్యవహారాలు నడిపిస్తూ ఉంటాయి. గత కొద్ది కాలంగా ఈ



పార్టీలలో సిద్ధాంతాలు, విలువలు ఏమీ కనిపించడం లేదు. అధికారమే ధ్యేయంగా పార్టీలు రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తూ ఉండడం గమనార్హం. అధికారం లేనప్పుడు క్షేత్రస్థాయిలో అంకితభావంతో కష్టపడి పార్టీకి పని చేసినవారికే టికెట్లు ఇస్తామని కార్యకర్తలకు, పార్టీ నాయకులకు పార్టీల అధిష్టానం తెలియచేస్తూ ఉంటుంది. పార్టీల అధిష్టానం మాటలను నమ్మి కార్యకర్తలు, నాయకులు ఇల్లూ, వళ్ళూ గుల్ల చేసుకుని పార్టీకి కష్టపడుతూ ఉంటారు. కానీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ గెలుపు గుర్రాలకే టికెట్లు అంటూ పార్టీల అధిష్టానం స్వరంలో మార్పు కనిపిస్తూ ఉండడం నిత్యకృత్యంగా మారింది. అందుకు అనుగుణంగా డబ్బు, కులం, పరపతి కలిగిన వ్యక్తులను ఎక్కడెక్కడినుంచో తెచ్చుకుని వారికి ఎం.ఎల్.ఏ, ఎం.పి. టికెట్లు కేటాయిస్తున్నారు. మరికొన్ని పార్టీలైతే అప్పటి వరకు తమ పార్టీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేసిన ప్రత్యర్ధి పార్టీ నాయకులను స్థానిక కార్యకర్తలు, నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగా పార్టీలో చేర్చుకుని వారికి టికెట్లు ఇస్తూ ఉన్నాయి. అయినా అధికారం కొరకు కార్యకర్తలు, నాయకులు అధినేత నిర్ణయాన్ని గౌరవించి తమ అభ్యర్ధి విజయానికి కష్ట పడుతున్నారు. అధికారం లభించాకయినా రాజకీయ పార్టీలు కార్యకర్తలకు న్యాయం చేస్తున్నాయా? అంటే అదీ లేదు. అధికారం లభించాక డబ్బు, కులం, పరపతి అవసరం లేని శాసన సభ్యుల కోటాలో, గవర్నర్ కోటాలో శాసన మండలి స్థానాలు, రాజ్యసభ స్థానాలు ప్రతి పార్టీకీ అనేకం లభిస్తాయి.

క్షేత్ర స్థాయిలో పార్టీ కొరకు కష్టపడే కార్యకర్తలను నాయకులుగా తయారుచేసి వారికి న్యాయం చేయాలని ఈ ప్రాంతీయ పార్టీ లకు నిజంగా ఉంటే ఈ పదవులు వారికి ఇవ్వ వచ్చు. కానీ ఇప్పటి వరకు ఏపార్టీ అయినా సామాన్య కార్యకర్తకు ఎం.ఎల్.ఏ కోటా, గవర్నర్ కోటాలోని శాసనమండలిలో స్థానం లేదా రాజ్య సభలో స్థానం కల్పించాయా? కార్యకర్తల చేత జీవితాంతం జెండా మోపిస్తారు. వారికి అత్యున్నత పదవులిచ్చి వారిని నాయకులుగా తీర్చిదిద్దేందుకు మాత్రం ఈ పార్టీలకు మనసొప్పడం లేదు. కనీసం నామినేటెడ్ పదవులలో కూడా క్షేత్ర స్థాయిలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు ఏపార్టీ న్యాయం చేయడం లేదు అని కచ్చితంగ చెప్పవచ్చు. ఇటీవలి కాలంలో గ్రామ స్థాయి నాయకునికి రాష్ట్ర స్థాయి పదవులు, ఎం.ఎల్.ఏ స్థాయి, రాష్ట్ర స్థాయి నాయకునికి చిన్న,చిన్న డైరెక్టర్ పదవులు కేటాయించడం అన్ని పార్టీలలో కనిపిస్తూ ఉంది. ఈ పరిణామాలు ఎందుకు జరుగుతున్నాయో? ఆ పార్టీల అధిష్టానానికే తెలియాలి. సాంకేతికత మరియు సలహాదారుల పై ఎక్కువగా ఆధార పడుతూ ఉండడంతో పార్టీల అధినేతలకు, క్షేత్ర స్థాయిలో పార్టీకి చిత్తశుద్ధితో పనిచేసే కార్యకర్తకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడింది అనడంలో ఎటువంటి సందేహం లేదు. కార్యకర్తలతో సమావేశమై వారిని స్వేచ్ఛగా మాట్లాడనిచ్చే పరిస్థితి ఏ అధినేత చేయడం లేదు. కార్యకర్తను స్వేచ్ఛగా మాట్లాడనిస్తేనే కదా పార్టీ లోటు పాట్లు అధినేతకు తెలిసేది. కార్యకర్త దగ్గర తాము చేసే తప్పులను చెప్పించుకునేందుకు ఏ పార్టీ అధినేత సాహసించడం లేదు. తాము చెప్పిందే కార్యకర్తలు వినాలి అనే ధోరణితో ప్రతి పార్టీ అధినేత వ్యవహరిస్తూ ఉన్నారు. ఒక వేళ ఏ కార్యకర్త అయినా అధినేతలు చేసే తప్పులు ఎత్తి చూపితే ఆ కార్యకర్త బ్రతుకు బస్టాండే. తన తప్పులు ఎత్తి చూపిన కార్యకర్త దశాబ్ధాలు పాటూ పార్టీ కొరకు కష్టపడినా పట్టించుకోకుండా వారిని డస్ట్ బిన్ లో వేసేసే పరిస్థితి ప్రతి పార్టీలో కనిపిస్తూ ఉంది. పార్టీల అధినేతలందరూ పార్టీ సమావేశాల్లో కూడా తమను వ్యక్తిగతంగా పొగిడించుకునేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అదేవిధంగా క్షేత్ర స్థాయిలో అష్టకష్టాలు అనుభవిస్తూ పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తను మించి సోషల్ మీడియాలో ప్రత్యర్ధులపై పోస్టులు పెట్టే వారికి, ప్రత్యర్ధి పార్టీల నేతలను తిట్టే వారికి, భజన పరులకు ఇటీవల అన్ని పార్టీలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఉండడం స్పష్టంగా కనిపిస్తూ ఉంది. పార్టీలు చేసే మంచి పనులను గ్రామ స్థాయిలో ప్రజలకు తెలియచేసేది మరియు అధినేతలు ఇచ్చే అలివికాని హామీలను క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ తీసుకుపోయేది, అధినేతలు ప్రత్యర్ధి పార్టీలపై రాజకీయ అవసరాల కొరకు చేసే విమర్శలకు క్షేత్ర స్థాయిలో అండగా నిలబడేది కార్యకర్తలే. అటువంటి నిజమైన కార్యకర్తలను విస్మరిస్తున్నందువలనే తెలుగు రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు సుధీర్ఘ కాలం పాటూ వరుసగా అధికారం లో ఉండలేకున్నాయి అనేది నిర్వివాద అంశం.

- కైలసాని శివప్రసాద్
9440203999

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం సందర్శించిన ఎస్టీ సెల్ మెంబర్



కుక్కునూరు, ఫిబ్రవరి 09 ( మనం న్యూస్ ) : స్థానిక మండలం లో సోమవారం నాడు కుక్కునూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఆంధ్రప్రదేశ్ ఎస్టి సెల్ మెంబెర్ కాకి లక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలతో మాట్లాడి విద్య, పాఠశాల లోని మౌలిక సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బా విద్యాలయం సిబ్బంది వారిని ఈ సందర్భంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో స్థానిక మండలం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ములిశెట్టి. నాగేశ్వరరావు,తెలుగుమహిళా గరటం రమణ, బయ్యన అపర్ణ ,నాయకులు పాదం రాము, భాస్కర్ అంగిరేకుల. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# గోద్రేజ్ ఆగ్రోవెట్ నుంచి కొత్త కీటక నాశిని టకాయ్ విడుదల

తాడేపల్లిగూడెం ఫిబ్రవరి 9,మనం ప్రతినిధి: : భారత్లోని ప్రముఖ వైవిధ్యభరితమైన అగ్రి బిజినెస్ సంస్థలలో ఒకటైన గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ (గోద్రేజ్ ఆగ్రోవెట్), వరి పంట కోసం అభివృద్ధి చేసిన సరికొత్త కీటక నాశిని టకాయ్ ని విడుదల చేసింది. జపాన్కు చెందిన ఐఎస్కే సంస్థ అభివృద్ధి చేసిన సైక్లాప్రిన్ టెక్నాలజీతో రూపొందిన టకాయ్, వరిలోని ప్రధాన తెగుళ్లైన కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగులపై సమర్థవంతంగా పనిచేస్తుంది. దీనిని నాట్లు వేసిన 15 నుంచి 30 రోజుల తర్వాత ఒకసారి, మళ్లీ 40 నుంచి 60 రోజుల తర్వాత 160 మి.లీ మోతాదులో వాడితే, వరి పంటకు సుదీర్ఘ కాలం పాటు రక్షణ లభిస్తుందని గోద్రేజ్ ఆగ్రోవెట్ ప్రతినిధి సునీల్ కటారియా చెప్పారు. మొక్కజొన్న, మిరప, క్యాబేజీ, సోయాబీన్, శనగ మరియు చెరకు పంటలలో కూడా టకాయ్ వినియోగానికి సంబంధించి లేబుల్ అనుమతులు పొందే ప్రక్రియలో కంపెనీ ఉందన్నారు. తీవ్రస్థాయిలో కాండం తొలిచే పురుగు ఆశించినప్పుడు 30 శాతం నుండి 40 శాతం వరకు దిగుబడి నష్టం వాటిల్లుతుందని, అదేవిధంగా ఆకు ముడత పురుగు ఉధృతి వల్ల 20 శాతం నుండి 30




శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ఇవి తరచూ పంట ప్రారంభ మరియు మధ్య దశలలో దాడి చేస్తాయి, ఆ సమయంలో వీటిని గుర్తించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టడం సవాలుతో కూడుకున్న పని. ఈ కారణాల వల్ల, భారత్ 150.18 మిలియన్ టన్నుల ఉత్పత్తితో ప్రపంచంలోనే అతిపెద్ద వరి ఉత్పత్తిదారుగా ఉన్నప్పటికీ, హెక్టారుకు సగటు దిగుబడి మాత్రం 2.9 టన్నుల వద్దే తక్కువగా ఉందన్నారు. ఇది ప్రపంచ అత్యుత్తమ దిగుబడి అయిన 5 టన్నులు/హెక్టారుతో పోలిస్తే చాలా తక్కువ అన్నారు. 'భారతీయ వరి రైతు విజయం అనేది సమర్థవంతమైన తెగుళ్ల నివారణపైనే ఆధారపడి ఉంటుంది. టకాయ్ ద్వారా మేము వరి రైతులకు తమ పంటలను తెగుళ్ల నుండి రక్షించుకునేలా చేయడమే కాకుండా, వేగవంతమైన నియంత్రణను, సుదీర్ఘ కాలం పాటు పని చేసే పరిష్కారాన్ని అందిస్తున్నాం అని, తద్వారా పంట ఆరోగ్యం మెరుగుపడుతుంది' అని తెలిపారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ వద్ద మా లక్ష్యం, మన రైతులు ఎదుర్కొంటున్న పర్యావరణ మరియు మార్కెట్ సవాళ్లను పరిష్కరించే పంట రక్షణ మార్గాలను అందించడం అని, టకాయ్ లాంచ్ మా వ్యూహానికి అనుగుణంగా ఉంది. మా పరిశోధన నైపుణ్యం, క్షేత్రస్థాయిలో మాకున్న పటిష్టమైన నెట్వర్క్ ద్వారా కీలకమైన పంటల విషయంలో మా పోర్ట్ఫోలియోను బలోపేతం చేస్తున్నాం అన్నారు. ఇది రైతులకు సాధికారతనివ్వడమే కాకుండా, వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుస్తుంది' అని వివరించారు.

## డైవర్షన్ కెనాల్కు ముమ్మర ఏర్పాట్లు



- పొత్తూరి రామరాజు

నరసాపురం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): నరసాపురం మండలం పాత నవరసపురం గ్రామంలోని కాజ డ్రైనుపై ఇటీవల నూతన వంతెన నిర్మాణ పనులు చేపట్టడంతో నీటి ప్రవాహం ఆగిపోయి చుట్టుపక్కల ఆరు గ్రామాలకు చెందిన పంట పొలాలు, చెరువులు నీట మునగడంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజును కలిసి సమస్యను వివరించారు. దీనిపై స్పందించిన రామరాజు నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై సమస్యను వివరించారు. నీటిని తాత్కాలికంగా మళ్ళించేందుకు పంట పొలాల మధ్య నుంచి డైవర్షన్ కెనాల్ త్రవ్వేందుకు రైతులు, భూమి యజమానులతో మాట్లాడి వారిని ఒప్పించారు. ప్రజలకు, రైతులకు వ్యవసాయ భూములకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని తక్షణమే డైవర్షన్ కెనాల్ పనులు చేపట్టే విధంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఈసందర్భం గా పొత్తూరి రామరాజు వారికి భరోసా ఇచ్చారు. కాజ డ్రైనుకు అనుసంధానంగా ఉన్న ఇతర కాలవలను తవ్వించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని రామ రాజు తెలిపారు. ఆయన దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సమస్యకు పరిష్కారం చూపారని ఈ సందర్భంగా రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, జక్కం శ్రీమన్నారాయణ, తెలుగురైతు అధ్యక్షుడు యర్రంశెట్టి నాగేశ్వరావు, నాగిడి రాంబాబు, అధికారులు, రైతులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు డ్రగ్స్, ర్యాగింగ్లకు దూరంగా ఉండాలి




- ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి

నరసాపురం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్): విద్యార్థినీ విద్యార్థులు ఏ విధమైన మత్తు పదార్థాలకు లోబడకుండా చదువుపై దృష్టి పెట్టాలని తమ తమ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించి తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి సభ్యుడు బొర్రా గోపి మూర్తి పిలుపు నిచ్చారు. స్థానిక స్వర్ణాంధ్ర కళాశాలలో సోమవారం ర్యాగింగ్ మరియు మాదకద్రవ్యాల వ్యతిరేకత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నరసాపురం రూరల్ సీఐ జి దుర్గాప్రసాద్, మొగల్తూరు ఎస్త్రై నాగలక్ష్మి, కళాశాల చైర్మన్ కొండవీటి సత్య నారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కళాశాల పాలకవర్గ సభ్యులు టి.వి.వి ప్రసాద్, సత్రశాల కీర్తి కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. గోపీ చంద్, కళాశాల విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పుట్టినరోజు వేడుకలు

కాట్రేనికోన, ఫిబ్రవరి 9,మనం ప్రతినిధి: ముమ్మిడివరం శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) 53వ జన్మదిన వేడుకలు కాట్రేనికోన మండలంలోని గ్రంధి నాగేశ్వరరావు కళ్యాణ మండపంలో పి ఎస్ఎన్ రాజు(విలేఖరి రాజు) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ కేకును కోసి స్వీట్లు పంచారు. రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. పార్టీ యువత ఉత్సాహం గా రక్త దాన శిబిరం లో పాల్గొని రక్త దానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, మాజీ శాసనసభ్యులు చెల్లి వివేకానంద, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు,దాట్ల పృధ్వి, చెల్లి అశోక్, తాడి నరసింహారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్యే బుచ్చిబాబు సేవలను కొనియాడారు. అనంతరం కాట్రేనికోన



పీహెచ్సీ లో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. అలాగే కాట్రేనికోన జిల్లా పరిషత్ హైస్కూల్ లో సుమారు 400 మంది విద్యార్థులకు మధ్యాహ్నం ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ,, మండల టిడిపి అధ్యక్షుడు చెల్లి సురేష్, నీటి సంఘం డిసి ఆకాశం శ్రీనివాస్, నడింపల్లి సుబ్బరాజు, సుధా బాబు రావు, రాష్ట్ర ఆక్వా డైరెక్టర్ విత్తనాల బుజ్జి,ఇసుక పట్ల వెంకటేశ్వరరావు, ఇసుక పట్ల వెంకటరమణ, బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ , బిజెపి మండల అధ్యక్షులు మట్ట శివ కుమార్, ముమ్మిడివరం మార్కెటింగ్ డైరెక్టర్ మట్ట సూరిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బడుగు పుల్లారావు,వెంట్రు సుధీర్, విత్తనాల వెంకటరమణ, వాసంశెట్టి రాజేశ్వరరావు, సర్పంచ్ రంబాల రమేష్, సర్పంచ్ సీతారామకృష్ణంరాజు, బండారు ఏసు,త్సవటపల్లి నాగు త్సవటపల్లి శ్రీనివాస్,జంగా శ్రీనివాస్, చీకురుమిల్లి చక్రదరరావు,నేలపాటి చెంచలరావు, నూకల దుర్గ బాబు, మోకా బాల ప్రసాద్, ,వనచర్ల నాగేశ్వరరావు, వంగ దుర్గ బాబు,ఎస్ వి ఎస్ రవి వర్మ,జొన్నాడ రాజారావు, సుధా రాఘవేంద్రరావు, గుత్తుల మహాలక్ష్మి, మాదే యోగేశ్వరి, గిడ్డి చంటి, ఉచ్చుల నారాయణ, కాంట్రేకుల సత్యప్రసాద్, కొండేటి చినబాబు, వంగా వాసు,పిటి వర్మ, కోటిపల్లి సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, అంగాని నరసింహ మూర్తి, వనచర్ల నాగేశ్వారావు, ఇసుక పట్ల రాంబాబు, పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గుడాల గోపి నాయకత్వాన్ని దెబ్బతీసే కుట్రలు ఫలించవు

- పోడూరు మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఖండన
- బీసీ నాయకుడిని రాజకీయంగా అణగతొక్కే ప్రయత్నం
- 2029లో పాలకొల్లు వైఎస్ఆర్సిపి కైవసం గోపి ఎమ్మెల్యే, జగన్ సీఎం




పోడూరు, ఫిబ్రవరి 9 మనం న్యూస్: పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న గుడాల గోపాలకృష్ణ (గోపి)ను మార్చేస్తున్నారని,ఆయన పనితీరు సరిగా లేదని, ముఖ్యంగా పోడూరు మండలాన్ని పట్టించుకోవడంలేదని ఇటీవల జరుగుతున్న ప్రచారం పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో చేసిన దుష్ప్రచారమేనని పోడూరు మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు కొర్రపాటి వీరస్వామి తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోడూరు మండల పరిధిలోని కొమ్ము చిక్కాల, వేడంగి, జిన్నూరు, మట్టపర్రు, పెనుమాదం, అప్పన్న చెరువు, వద్దిపర్రు, రావిపాడు గ్రామాలను గుడాల గోపి పట్టించుకోవడంలేదని చెబుతూ బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అందులో ఏ మాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. గుడాల గోపి నిరంతరం నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. బీసీ వర్గానికి చెందిన గుడాల గోపాలకృష్ణకి పెరుగుతున్న రాజకీయ ప్రాభవాన్ని చూసి,ఆయనను రాజకీయంగా అణగతొక్కి 2029లో జరిగే ఎన్నికల నుంచి తప్పించాలని లక్ష్యంగా మీడియాని అడ్డంగా పెట్టుకుని కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కొర్రపాటి వీరస్వామి ఆరోపించారు.ఇలాంటి నీచమైన రాజకీయ కుట్రలకు పోడూరు మండలంలోని వైఎస్ఆర్సిపి శ్రేణులు ఏమాత్రం లొంగబోమని స్పష్టం చేశారు.పోడూరు మండలంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా అతి త్వరలోనే గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, కార్యకర్తలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చే కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.గుడాల గోపి నాయకత్వంపై పూర్తి విశ్వాసంతో మండలంలోని నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగుతున్నారని చెప్పారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న వైఫల్య పరిపాలనతో ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని, ఆ ప్రభావంతో 2029 ఎన్నికల్లో పాలకొల్లు నియోజకవర్గంలో వారికి గెలిచే పరిస్థితి లేదని కొర్రపాటి వీరస్వామి ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో పాలకొల్లు నియోజకవర్గాన్ని వైఎస్ఆర్సిపి కైవసం చేసుకుంటుందని, గుడాల గోపాలకృష్ణ ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని స్పష్టం చేశారు. అదే విధంగా రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి తిరిగి అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని ఆయన పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. గుడాల గోపి నాయకత్వంలో పాలకొల్లు నియోజకవర్గం రానున్న సార్వత్రికి ఎన్నికల్లో వైఎస్ఆర్సిపికి కంచుకోటగా మారుతుందని కొర్రపాటి వీరస్వామి స్పష్టం చేశారు.

## పీఎం ఉజ్వల్ యోజన ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణి



కుక్కునూరు,ఫిబ్రవరి 09 ( మనం న్యూస్): స్థానిక మండల కేంద్రంలో ఉన్నటువంటి హెచ్.పీ గ్యాస్ కార్యాలయం నందు ప్రధానమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పేద మహిళలకు ఉచితంగా అందిస్తున్నటువంటి ఉజ్వల గ్యాస్ కనెక్షన్ అర్హులైన లబ్ధిదారులకు సోమవారం నాడు అందజేశారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హెచ్పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ అయినటువంటి కుచ్చర్లపాటి అప్పలరాజు,ఏలూరు జిల్లా బిజెపి ధార్మిక సెల్ కో కన్వీనర్ వాడపల్లి లక్ష్మణాచార్యులు మాట్లాడుతూ ఈ గ్యాస్ కనెక్షన్లు కేంద్ర ప్రభుత్వం నుండి నరేంద్ర మోడీ ద్వారా అందించబడుతున్నామని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కుక్కునూరు మండలంలో అర్హులైన ప్రతి మహిళ సోదరీమణులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉజ్వల పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు పొందాలని కోరారు.అలానే జనసేన మండల అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్ మాట్లాడుతూ వంట గ్యాస్ సిలిండర్ ప్రజా జీవితంలో పెను మార్పులు తీసుకొచ్చింది. దేశంలో చాలా మంది పేదలు వంట కోసం ఇప్పటికీ కట్టెలు, బొగ్గుల పొయ్యిలపై ఆధారపడుతున్నారు. పేద కుటుంబాలకు వంట గ్యాస్ సిలిండర్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ప్రారంభించింది అని తెలిపారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కుక్కునూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ములిసెట్టి నాగు , జనసేన కుక్కునూరు మండల అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్ జనసేన ఉపాధ్యక్షులు, మంత్రి గోపాలకృష్ణ, బిజెపి కుకునూరు మండల కార్యదర్శి మణికంఠ , తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాదం రాము , కుక్కునూరు టౌన్ ప్రెసిడెంట్ సీత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# డయల్ యువర్ సీఎండీకి విశేష స్పందన

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి
- డయల్ యువర్ సి ఎం డి కార్యక్రమానికి విశేష స్పందన

కాట్రేనికోన, ఫిబ్రవరి 9,మనం ప్రతినిధి :విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రారంభించిన డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 48 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటులో ఇబ్బందులు, ట్రాన్స్ఫార్మర్ల మార్పిడిలో జాప్యం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఎస్టిమేషన్లు, విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ బిల్లులు, విద్యుత్ లైన్లు స్తంభాల మార్పిడి, విద్యుత్ స్తంభాలపై వైర్లు వేలాడుతుండడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సీఎండీ



పృథ్వీతేజ్ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేంత వరకు కార్పొరేట్ కార్యాలయ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు 9493681912 కు చాట్ చేయడం ద్వారా కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాష్, టి.వనజ, ఎస్.హరిబాబు, సీజీఎం వి.విజయలలిత, జీఎం ఎం.ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ ప్రాచీన జ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి

విశాఖపట్నం, మనంన్యూస్: భారతీయ సాంప్రదాయ ప్రాచీన జ్ఞానాన్ని భవిష్యత్ తరానికి అందించడం ఎంతో అవసరమని ఏయూ సంస్కృత విభాగం విశ్రాంత ఆచార్యులు జి.ఎ శర్మ అన్నారు. సోమవారం ఏయూ మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో యూజీసీ సహకారంతో ఇంటిగ్రేషన్ ఆన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్ (ఐకెఎస్) ఇన్ కరకులం అంశంపై నిర్వహిస్తున్న కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సత్యాన్ని తెలుసుకోవడమే జ్ఞానమన్నారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఏయూ అధికారులకు, సహకారం అందిస్తున్న యూజీసీని అభినందించారు.. విద్యమంత్రిత్వ శాఖ యూజీసీ- ఆర్థిక సలహాదారు సుదీప్ సింఘ్ జైన్ మాట్లాడుతూ 2023 సంవత్సరం నుంచి భారతీయ ప్రాచీన జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వైవిద్యమైన అంశాలపై ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ వేద గణితంలో ఉన్న పలు గణిత సూత్రాలు చిన్నవిగా ఉంటాయని, వాటి విశ్లేషణ ఎంతో నిఘూఢంగా ఉంటుందన్నారు. భాష తెలిస్తే వీటిని సరళంగా, విపులీకరించడం సాధ్యపడుతుందన్నారు. దేశానికి నూతన ఆవిష్కరణలు ఎంతో అవసరమని, అదే




సమయంలో ప్రాచీన సాంప్రదాయ జ్ఞానాన్ని బద్రపరచడం, భవిష్యత్ తరాలకు అందించడం ఎంతో కీలకమన్నారు. భారతీయ జ్ఞాన వ్యవస్థను మరింత విస్తృతం చేయడం, విద్యలో భాగం చేయడానికి ఈ కార్యక్రమం ఎంతో కీలకంగా నిలుస్తుందన్నారు. మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం సందాలకులు ఆచార్య కె.ఈశ్వర్ కుమార్ ఆరు రోజుల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం కార్యక్రమం ప్రాధాన్యత, నిర్వహణ విదానం తదితర అంశాలను వివరించారు. జాతీయ విద్య విదానంలో ప్రాచీన భారతీయ జ్ఞానాన్ని బోధన, అభ్యసన, పరిశోధనల్లో భాగం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆచార్య సి. శ్యామల తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అతిధులను సత్కరించారు.

## ముత్తూట్ ఫిన్ కార్ప్ లిమిటెడ్తో హెచ్డీఎఫ్సీ లైఫ్ ఎంఓయూ

విజయవాడ, ఫిబ్రవరి 9(మనంన్యూస్): భారతదేశంలోని ప్రముఖ జీవిత బీమా కంపెనీ హెచ్డీఎఫ్సీ లైఫ్ కేరళలోని తిరువనంతపురంలో ప్రధాన కార్యాలయం కలిగిన ముత్తూట్ పప్పచన్ గ్రూప్ (ముత్తూట్ బ్లూ) యొక్క ప్రధాన సంస్థ అయిన ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ కస్టమర్లు హెచ్డీఎఫ్సీ లైఫ్ యొక్క సమగ్రమైన గ్రూప్ మరియు వ్యక్తిగత జీవిత బీమా పరిష్కారాలను యాక్సెస్ చేయడానికి వీలు కలుగుతుంది. ఇందులో రక్షణ మరియు దీర్ఘకాలిక పొదుపు ఉత్పత్తులు ఉన్నాయి. ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ యొక్క విలువైన కస్టమర్లకు, ఇప్పటికే ఉన్న మరియు కొత్త, ప్రభావవంతమైన జీవిత బీమా పరిష్కారాలను అందించడానికి మేము కట్టుబడి ఉన్నామన్నారు. ఇది వారి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి వీలు కల్పిస్తుంది. ఇంకా, మా ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ యొక్క టచ్పాయింట్లలోని బృందాలు.. వారి కస్టమర్లకు ఆనందదాయకమైన అనుభవాన్ని



అందించడానికి డిజిటల్గా సాధికారత పొందేలా చేస్తుంది. ఈ భాగస్వామ్యం ద్వారా, దేశంలో జీవిత బీమా పరిధిని విస్తరించడానికి మరియు ఆర్థిక చేరికను ప్రోత్సహించడానికి మేము ఎదురుచూస్తున్నాము. అని అన్నారు. ముత్తూట్ ఫిన్కార్ప్ లిమిటెడ్ డైరెక్టర్ షాజీ వర్గీస్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం 3,750 కి పైగా శాఖల పరిధి, డిజిటల్ ప్లాట్ఫారమ్లు, మిలియన్ల మంది వినియోగదారులతో మాకున్న సంబంధాలు మరియు హెచ్డిఎఫ్సి లైఫ్ యొక్క ఉత్పత్తి మరియు రిస్క్ నైపుణ్యాన్ని కలిపి భారతీయ కుటుంబాలకు అర్థవంతమైన రక్షణను అందిస్తాయని చెప్పారు.

# యుఫోరియా మూవీ మనసుకు హత్తుకునే సినిమా

- ప్రతి ఒక్కరు తప్పక చూడాల్సిన సినిమా
- విశాఖపట్నం సిపి శంకబ్రత బాగ్చి




విశాఖపట్నం, (మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి): తెలుగు సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిభావంతమైన దర్శకుల జాబితాలో గుణశేఖర్ పేరు ఉంటుంది.మూడు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్న ఆయన ఎన్నో సూపర్ హిట్ సినిమాలు తెరకెక్కించారు. ఒక్కడు, రుద్రమదేవి, రామాయణం వంటి చిత్రాలతో చరిత్రాత్మక, సామాజిక, యాక్షన్ జానర్లలో తన ప్రత్యేక ముద్ర వేశారు. అయితే, గత కొన్నేళ్లుగా గుణశేఖర్కు సరైన విజయం దక్కలేదు. శాకుంతలం ఫ్లాప్ తర్వాత సరికొత్త కాన్సెప్ట్ 'యుఫోరియా' మూవీని తెరకెక్కించారు. యువతరం మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఎలాంటి నష్టాలు చూడాల్సి వస్తుందో నేటి తరానికి కనెక్ట్ అయ్యేలా ఈ మూవీని తెరకెక్కించారు. నగరంలోని కిన్నెరా సినిమా హాల్లో నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి ఆధ్వర్యంలో హోంగార్డ్ నుంచి సీనియర్ అధికారుల వరకు అందరూ తమ కుటుంబాలతో కలిసి 'యుఫోరియా' చిత్రాన్ని వీక్షించారు. మత్తు పదార్థాల ఉచ్చులో పడి యువత జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారో ఈ సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారని యువతను ఆలోచింపజేసే ఇలాంటి సందేశాత్మక సినిమాలు సామాజిక మార్పుకు ఎంతో అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చిమాట్లాడుతు.ప్రతి ఒక్కరు తప్పక చూడాల్సిన చిత్రమే పేర్కొన్నారు ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.

చైత్ర (సారా అర్జున్) చదువులో టాపర్. ఐఏఎస్ కావాలనే కోరికతో సివిల్స్కి ప్రిపేర్ అవుతూ ఉంటుంది. ఆర్థికంగా బలంగా ఉన్న అమ్మాయి కూడా ఒకరోజు తన స్నేహితురాలు పిలుపుమేరకు ఓ పబ్కు వెళ్తుంది. అక్కడ చైత్రకు పరిచయమైన ఐదుగురు కుర్రాళ్లలో వికాశ్ (విఘ్నేశ్ గవిరెడ్డి) ఆమెపై కన్నేస్తాడు. డ్రగ్స్ మత్తులో ఉన్న వారందరూ చైత్రను నమ్మించి కారులో తీసుకెళ్తారు. ఈ క్రమంలోనే ఆమెపై దారుణంగా అత్యాచారానికి పాల్పడతారు.

చైత్ర ఈ విషయాన్ని తన తల్లిదండ్రుల పోలీసులకు ఫిర్యాదు చేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ కేసును కమిషనర్ జయదేవ్ (గౌతమ్ మేనన్) ఛేదించేందుకు రంగంలోకి దిగుతాడు.అయితే, చైత్రను అత్యాచారం చేసిన ఐదుగురు కుర్రాళ్ల బ్యాక్గ్రౌండ్ చాలా బలంగా ఉంటుంది. వారిలో సంపన్న కుటుంబాలకు చెందిన వారితో పాటు రాజకీయ, వ్యాపారవేత్తల పిల్లలు ఉన్నారు. ఇలాంటి క్లిష్టసమయంలో కమిషనర్ జయదేవ్ కేసును ఎలా ఛేదించారు? ఈ కేసులో నేను కూడా నేరం చేశానని వింధ్య వేములపల్లి (భూమిక) ఎంట్రీ ఇస్తుందిఇంతకీ ఈ నేరంతో ఆమెకు ఉన్న సంబంధం ఏంటి.? తనకు శిక్ష విధించాలని హైకోర్టును ఎందుకు కోరుతుంది..? ఈ కేసుని డీల్ చేస్తున్న సిటీ కమిషనర్ జయదేవ్కు వింధ్య చేసిన సాయం ఏంటి..? తప్పు చేసిన వారికి శిక్ష పడేలా వింధ్య ఎలాంటి సాహసం చేసింది..? తెలియాలంటే యుఫోరియా మూవీ చూడాల్సిందే.

## ఆర్థిక అక్షరాస్యతతోనే సరైన ఆర్థిక నిర్ణయాలు

### జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్



పాడేరు ఫిబ్రవరి 9: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బిఐ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి 13 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్,ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుమణి శ్రీ పూజ సహాయ కలెక్టర్ కే సాకేత్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సురక్షిత బ్యాంకింగ్ విధానాలు పాటించడం, డిజిటల్ లావాదేవీలను జాగ్రత్తగా నిర్వహించడం, పొదుపు అలవాట్లు పెంపొందించుకోవడం, ఆర్థిక మోసాల నుండి రక్షణ పొందడం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. అలాగే ఈ వారోత్సవం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తనపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ సేవలు, బీమా, పెన్షన్ పథకాలు మరియు డిజిటల్ ఆర్థిక భద్రతపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (బ్యాంక్) మాతు నాయుడు , డీఆర్డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, జిల్లా పౌర సరఫరాల అధికారి వి. మోహన్ పాల్గొన్నారు.



## డయల్ యువర్ సీఎండీకి విశేష స్పందన

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 09: విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) ప్రారంభించిన డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం ఉదయం డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 48 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటులో ఇబ్బందులు, ట్రాన్స్ఫార్మర్ల మార్పిడిలో జాప్యం, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఎస్టిమేషన్లు, విద్యుత్ లైన్ల మార్పు, విద్యుత్ బిల్లులు, విద్యుత్ లైన్లు స్తంభాల మార్పిడి, విద్యుత్ స్తంభాలపై వైర్లు వేలాడుతుండడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేంత వరకు కార్పొరేట్ కార్యాలయ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు 9493681912 కు చాట్ చేయడం ద్వారా కూడా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి.వి.సూర్యప్రకాష్, టి.వనజ, ఎస్.హరిబాబు, సీజీఎం వి.విజయలలిత, జీఎం ఎం.ఝాన్సీ పాల్గొన్నారు.

## అనువైన ప్రాంతాల్లో మిక్స్డ్ కాఫీ ప్లాంట్స్ ఏర్పాటు

### జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ

ఏ ఎస్ ఆర్ జిల్లా (పాడేరు)ఫిబ్రవరి 9: కాఫీ సాగు పెంపొందించడంతో పాటు అంతర పంటల పై అవగాహన కల్పిస్తే మంచి ఫలితలతో పాటు ఎక్కువ ఆదాయం రైతులకు లభిస్తుందని జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ అన్నారు.

సోమవారం ఐటిడిఏ సమావేశం మందిరంలో సంబంధిత శాఖ అధికారులతో కాఫీ పంటల కు, అంతర్ పంటల ఉత్పత్తులు పెంపొందించేందుకు కావలసిన ప్రణాళికను రూపొందించుకోవాలని సూచనలు చేశారు.

**మిక్స్డ్ సీడ్ క్రాప్ ఏర్పాటు**

అనుకూలమైన ప్రాంతాలలో కాఫీతో పాటు ఇతర మిశ్రమ పంటలను ప్రోత్సహించడం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది.

కాఫీ తోటల్లో మిరియాలు (Black Pepper), పసుపు, లేదా అల్లం వంటి పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలి. నీడ నిచ్చే చెట్లు, కాఫీకి అవసరమైన నీడ కోసం సిల్వర్ ఓక్ వంటి చెట్లను పెంచడం వల్ల భవిష్యత్తులో వాటి ద్వారా కూడా ఆదాయం వస్తుంది. కల్టివేషన్ క్రాఫ్ట్ ద్వారా శిక్షణ,

రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం ద్వారా నాణ్యమైన దిగుబడిని సాధించవచ్చునని, క్షేత్రస్థాయి ప్రదర్శనలు వల్ల మోడల్ ఫామ్స్ ఏర్పాటు చేసి, రైతులకు ప్రాసెసింగ్, సేంద్రియ ఎరువుల వినియోగం యాజమాన్యంపై ప్రత్యక్ష శిక్షణ ఇవ్వాలి.సాంకేతిక సహాయంతో పాటు కాఫీ బోర్డు అధికారుల సమన్వయం రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు అందించాలి.

**కాఫీ సీడ్ ఉత్పత్తి పెంపొందించడం**

స్థానికంగా నాణ్యమైన విత్తనోత్పత్తి జరిగితే రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, ఈ ప్రాంత నేలలకు అనుకూలమైన మొక్కలు అందుబాటులోకి తేవాలన్నారు. గ్రామ స్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి, విత్తన సేకరణ మరియు నర్సరీల నిర్వహణపై వారి అభిప్రాయాలు తీసుకోని, మొక్కల పెంపకం పై ప్రోత్సాహకాలు, ఎక్కువ విత్తనోత్పత్తి చేసే రైతులకు రాయితీలు లేదా ప్రత్యేక గుర్తింపునివ్వడం ద్వారా ఇతరులను ప్రేరేపించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (పి వి టి జి ) వెంకటేశ్వరరావు, కాఫీ డిడి హెచ్ ఆర్ మురళీధర, కాఫీ ఏడి బొంజుబాబు, కాఫీ కి సంబంధించిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

## చర్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న చెరుకూడా శ్రీరంగనాథరాజు



పెనుగొండ ఫిబ్రవరి 9(మనం మనం న్యూస్): పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామం లంకపేటలో నూతనంగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవం భక్తి, విశ్వాసం, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది. గ్రామ ప్రజల చిరకాల ప్రార్థనలకు ప్రతిఫలంగా రూపుదిద్దుకున్న ఈ చర్చి ప్రారంభోత్సవానికి రాష్ట్ర మాజీ గృహ నిర్మాణ శాఖ మంత్రి, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు చెరుకూడా శ్రీరంగనాథరాజు ముఖ్య అతిథిగా పాల్గొనడం విశేషంగా నిలిచింది.

ఈ సందర్భంగా శ్రీరంగనాథరాజుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, చర్చి సంఘ పెద్దలు, స్థానిక క్రైస్తవ విశ్వాసులు హృదయపూర్వక స్వాగతం పలికారు. ప్రార్థనల మధ్య, కీర్తనల నడుమ జరిగిన ఈ కార్యక్రమం లంకపేట గ్రామాన్ని ఆధ్యాత్మిక వెలుగులతో నింపింది.

ప్రారంభోత్సవ సభలో మాట్లాడిన శ్రీరంగనాథరాజు, క్రైస్తవ్యం అనేది కేవలం ఒక మతం మాత్రమే కాదని, అది ప్రేమ, క్షమ, సేవ అనే దైవిక మార్గమని అన్నారు. యేసు క్రీస్తు బోధించిన త్యాగం, దయ, మానవత్వం సమాజానికి దిశానిర్దేశం చేస్తున్నాయని పేర్కొన్నారు. కష్టకాలాల్లో క్రైస్తవ విశ్వాసం మనసుకు ధైర్యం, జీవితానికి ఆశను అందిస్తుందని భావోద్వేగంగా తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో చర్చిలు ఆధ్యాత్మిక ఆశ్రయాలుగా, సమాజ సేవకు కేంద్రాలుగా మారుతున్నాయని పేర్కొంటూ, లంకపేటలో నిర్మితమైన ఈ నూతన చర్చి గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడాలని ఆకాంక్షించారు. మతభేదాలు లేకుండా అందరూ ప్రేమతో జీవించడమే నిజమైన భక్తి అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో చర్చి పెద్దలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని మరింత ఆధ్యాత్మికంగా, భావోద్వేగపూరితంగా మలిచారు. నూతన చర్చి ప్రారంభోత్సవం లంకపేట గ్రామ చరిత్రలో ఒక స్మరణీయ ఘట్టంగా నిలిచింది.

## ఎడ్లకొండ సమీపంలో 23 కిలోల గంజాయి స్వాధీనం

- ముగ్గురు యువకుల అరెస్ట్ - స్కూటీ, మొబైల్ ఫోన్లు సీజ్



మారేడుమిల్లి (గుర్తేడు )మనం న్యూస్( ఫిబ్రవరి 9): పోలవరం జిల్లా గుర్తేడు పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు గట్టి నిగా పెట్టారు. గుర్తేడు ఎస్.ఐ ఎన్. రాజ్కోటి తన సిబ్బందితో కలిసి ఎడ్లకొండ గ్రామ శివారు ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు.

ఎస్సై వారిని తనిఖీ చేయగా వారి వద్ద సుమారుగా 23 కిలోల గంజాయి గుర్తించారు. దానిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు 1,15,000 ఉంటుందని అంచనా వేశారు.

అలాగే నిందితుల వద్ద నుంచి మూడు మొబైల్ ఫోన్లు ఒక స్కూటీని స్వాధీనం తీసుకొని వాహనాన్ని సీజ్ చేశారు. పట్టుబడిన ముగ్గురు గుడివాడ ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు.వీరు ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకువెళ్తూ అక్రమ రవాణాలో పాల్గొన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై రాజ్ కోటి తెలిపారు.. గంజాయి మత్తు పానీయాలు రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రుడి మట్టిని భూమికి తెస్తున్నారు

### చంద్రయాన్-4 ల్యాండింగ్ సైట్ ఖరారు చేసిన ఇస్రో



హైదరాబాద్, ఫిబ్రవరి 9 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్-3 ప్రయోగం విజయం భారత దేశానికి ఎంతో పెరును సంపాదించి పెట్టిన విషయం తెలిసిందే. ఈ భారీ ప్రయోగం 2023, జూలై 14న మధ్యాహ్నం 2:35 గంటలకు ఆంధ్రప్రదేశ్లోని శ్రీహరికోటలో ఉన్న సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంనుండి రాకెట్ ద్వారా ఈ నౌకను నింగిలోకి పంపారు.

దాదాపు 40 రోజుల సుదీర్ఘ ప్రయాణం తర్వాత, ఆగస్టు 23, 2023 న సాయంత్రం 6:04 గంటలకు చంద్రయాన్-3 ల్యాండర్ (విక్రమ్) చంద్రుడి దక్షిణ ధ్రువంపై సురక్షితంగా అడుగుపెట్టింది.

ఈ అద్భుత విజయంతో చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్ను విజయవంతంగా దించిన ప్రపంచంలోనే మొట్టమొదటి దేశంగా భారత్ సరికొత్త చరిత్రను లిఖించింది. కాగా ఈ భారీ విజయం తర్వాత మరో ప్రతిష్టాత్మక ప్రయోగానికి ఇస్రో సిద్ధం అయింది. చంద్రుడి మట్టిని భూమికి తెచ్చేందుకు ఇస్రో మాస్టర్ ప్లాన్ వేసింది. ఇందులో భాగంగా.. క్లిష్టమైన 'చంద్రయాన్-4' మిషన్పై దృష్టి పెట్టింది. ఈ ప్రయోగానికి సంబంధించిన అత్యంత కీలకమైన అడుగు పడింది. చంద్రుడిపై ల్యాండర్ ఎక్కడ దిగాలో ఆ ప్రాంతాన్ని శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు.

## ట్రంప్ బెదిరింపులు..

### 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్..!



టెహరాన్ ,ఫిబ్రవరి 9: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులతో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరాన్కు చేరువలో అమెరికా తన యుద్ధ నౌకలను మోహరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ 37 ఏళ్ల సంప్రదాయానికి బ్రేక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 8న ఎయిర్ఫోర్స్ కమాండర్లతో ఏటా ఆయన భేటీ అవుతుంటారు. ఈసారి ఆ సమావేశంలో ఆయన పాల్గొనలేదని ఇరాన్ ఇంటర్నేషనల్ వెల్లడించింది. 1989లో సుప్రీంలీడర్గా బాధ్యతలు అందుకున్న దగ్గరినుంచి చివరకు కరోనా సమయంలో కూడా ఈ వార్షిక సమావేశాన్ని ఆయన మిస్ చేయకపోవడం గమనార్హం. 1979లో ఫిబ్రవరి 8న పహ్లావీ పాలకులకు వ్యతిరేకంగా రుహొల్లా ఖొమేనీకి వాయుసేన అధికారులు విధేయత ప్రకటించారు. దాంతో గత నాలుగు దశాబ్దాలుగా ఆ రోజుకు గుర్తుగా ఎయిర్ఫోర్స్ అధికారులు సుప్రీం లీడర్తో సమావేశం అవుతుంటారు. ఇదిలాఉంటే.. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరింపులు పెంచుతోంది. ఆ దేశం వైపు తమ నౌకాదళం కదులుతోందని, అది అక్కడికి చేరుకున్న తర్వాత ఎలా పనిచేస్తుందో చూద్దామంటూ ట్రంప్ హెచ్చరికలు కొనసాగుతున్నాయి. అమెరికా తమపై దాడికి పాల్పడితే అది పశ్చిమాసియాలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని ఖమేనీ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఒకవైపు రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతుండగా.. మరోవైపు ఒమన్ వేదికగా పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది.

## ఫీజులు పెంచినా విదేశీ టాలెంట్ కావాల్సిందే..

### ఏఐతో 'హెచ్-1బీ'కి డిమాండ్..!




న్యూయార్క్ ,ఫిబ్రవరి 9: టెక్ కంపెనీల విదేశీ నియామకాలను తగ్గించేందుకు హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ను ట్రంప్ సర్కారు కఠిన తరం చేసింది. ఈ వీసాలకు ఏకంగా లక్ష డాలర్ల ఫీజును నిర్ణయించింది. అయినప్పటికీ.. టెక్ కంపెనీలు మాత్రం ఈ వీసాదారుల వైపే మొగ్గుచూపుతున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్పై భారీగా పెట్టుబడులు పెడుతున్న కంపెనీలు.. ఆ లక్ష్యాల సాధన కోసం పెద్ద సంఖ్యలో విదేశీ టాలెంట్ను నమ్ముకుంటున్నాయి. ఈ క్రమంలోనే 'హెచ్-1బీ' వీసాలకు డిమాండ్ పెరుగుతున్నట్లు నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ నివేదిక వెల్లడించింది.

ఇమిగ్రేషన్ డేటాను అధ్యయనం చేసి ఎన్ఎఫ్ఏపీ ఈ నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం.. 2025 ఆర్థిక సంవత్సరంలో కొత్త హెచ్-1బీ వీసాల జారీ కోసం టెక్ కంపెనీలు సమర్పించిన లేబర్ కండీషన్స్ అప్లికేషన్స్లో 80శాతానికి పైగా ఏఐ సంబంధిత నియామకాలవేనని నివేదిక తెలిపింది. అత్యధికంగా అమెజాన్, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్ వంటి కంపెనీలు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో అమెజాన్ అత్యధికంగా 4,644 మంది హెచ్-1బీ వీసాదారులను నియమించుకుంది. సాఫ్ట్వేర్ డెవలపర్లు, కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ రీసెర్చ్ సైంటిస్టులు, డేటా సైంటిస్టుల విధుల కోసం కంపెనీలు ఈ వీసాదారులను ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి.

అధునాతన ఏఐ సాంకేతికతలో అమెరికన్లకు నైపుణ్యాల కొరత వల్లే కంపెనీలు విదేశీ టాలెం ఆధారపడుతున్నట్లు ఎన్ఎఫ్ఏపీ నివేదిక తెలిపింది. అమెరికా వర్సిటీల్లో కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ చదువుతున్న విద్యార్థుల్లో 80శాతం మంది విదేశీయులే. ఇక, ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో 75శాతం మంది విదేశీ విద్యార్థులున్నారు. చదువు పూర్తయిన తర్వాత ఈ గ్రాడ్యుయేట్లు కొంత కాలం పాటు ఓపీటీ కింద పనిచేయవచ్చు. ఆ వ్యవధి తరువాత వారిని కంపెనీలు తీసుకోవాలంటే హెచ్-1బీ వీసా ఒక్కటే మార్గం. అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ కంపెనీలు ప్రస్తుతం కృత్రిమ మేధపై భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. 2025లో ఈ ఐదు కంపెనీలు 380 బిలియన్ డాలర్లకు పైగా ఏఐపై వెచ్చించాయి. రానున్న కాలంలోనూ ఈ రంగంపై భారీగా ఖర్చు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దీర్ఘకాల లక్ష్యాల కోసం హెచ్-1బీ వీసా ఫీజులను భరించి నియామకాలు చేపట్టేందుకు కంపెనీలు మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## హిమంత వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకెళ్తాం

డిస్పూర్,ఫిబ్రవరి 9: తమ కుటుంబానికి పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్తో సంబంధాలు ఉన్నాయని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలపై లోక్సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ స్పందించారు. 2013లో తన పాక్ పర్యటనపై సిట్ అధికారులు తనను ఎన్నడూ ప్రశ్నించలేదన్నారు. ప్రజల మధ్యలో మతపరమైన విద్వేషాలు సృష్టించేందుకు హిమంత బిశ్వశర్మ ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. తన భార్య, మైనర్ పిల్లలపై అసంబద్ధమైన ఆరోపణలు చేసినందుకుగాను అస్సాం సీఎం వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు. ఆయన మాట్లాడిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గతంలో తన భార్య పాకిస్థాన్కు వెళ్లడం నిజమేనని..కానీ వృత్తి సంబంధమైన పనిలో భాగంగా అక్కడికి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. ఆమెతో పాటు తాను కూడా 10 రోజుల పాటు పాకిస్థాన్కు వెళ్లినట్లు తెలిపారు. ఈ పర్యటన సమయంలో తాను అక్కడ ఎవరినీ కలవలేదన్నారు. ఆ విషయంపై హిమంత బిశ్వశర్మ అర్థం లేని, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.



కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్

# రానున్న అసెంబ్లీ సమావేశాలలో నిరుద్యోగ సమస్యపై చర్చించాలి

- ఎన్నికల హామీమేరకు తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి




కర్నూలు, ఫిబ్రవరి 09మనం న్యూస్ః రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని వివిధ ప్రభుత్వశాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ రోజు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర వ్యాప్త నిరసనలలో భాగంగా కర్నూల్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి నగర అధ్యక్షులు నాగరాజు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈ శ్రీరాములు, కె శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి పెద్దలు ఎన్నికల సమయంలో రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీలను అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే భర్తీ చేస్తాము, ప్రతి సంవత్సరము జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాము, నిరుద్యోగ యువతకు శిక్షణ మరియు ప్రోత్సహకాలు ఇచ్చి పారిశ్రామికవేత్తలు గా మారుస్తాము, అలాగే నిరుద్యోగ యువతకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తాము అని హామీలు ఇచ్చిన అధికారంలోకి వచ్చి 19 నెలలు గడచినా ఏ ఒక్క హామీ అమలుకు స్పష్టమైన కార్యాచరణకు పూనుకోకుండా కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని అఖిల భారత యువజన సమాఖ్యగా (అఇ్గఈ) తీవ్రముగా ఖండిస్తున్నాము అని అన్నారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రానున్న అసెంబ్లీ సమావేశాలలో నిరుద్యోగ సమస్యపై చర్చించి. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని, తక్షణమే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వాలి ఎన్నికల సమయంలో వాలంటీర్లకు ఇచ్చిన హామీ మేరకు న్యాయం చేయాలి అని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో వచ్చినటువంటి పెట్టుబడులు, తద్వారా నిరుద్యోగ యువతకు కలిగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు అలా కాకుండా లడ్డు పేరుతో రాజకీయాలు చేసి, చంద్రబాబు పవన్ కళ్యాణ్, పవన్ కళ్యాణ్ నారా లోకేష్ ని పొగుడుకుంటూ అసెంబ్లీ సమావేశాలు కాలయాపన చేస్తే ఏఐవైఎఫ్ గా అసెంబ్లీ ముట్టడిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సహాయ కార్యదర్శులు బిషన్న, రాజీవ్ లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డునపడ్డ వార్డు వాలంటరీలు, ఏపీ బెవరేజస్ కార్పొరేషన్ క్రింద పనిచేసిన ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బందిని, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ క్రింద పనిచేసిన రేషన్ వెహికల్ డ్రైవర్స్ మరియు హెల్పర్స్ కు న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణ కార్యాచరణ ప్రకటించాకపోతే రాష్ట్ర వ్యాప్తముగా నిరుద్యోగ సమస్యపై పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని అవసరమైతే సీఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వాలంటరీ అసోసియేషన్ నాయకులు మహబూబ్ బాషా, ఏఐవైఎఫ్ నగరనాయకులు శ్రీకాంత్, చిన్న, చంటి, అఖిల్ కళాకారు, భద్ర కుమార్, రసూలు వీరయ్య రవి, రాజశేఖర్, సురేంద్ర యాదవ్ తదితరులున్నారు.

# గత వైసీపీ ప్రభుత్వంలో మేము ధృతరాష్ట్రుడు పాత్ర పోషించం

- మాజీ మంత్రి ,టీడీపీ గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



మంత్రాలయం , ఫిబ్రవరి 9,మనం న్యూస్ః గత వైసీపీ ప్రభుత్వం లో మేము ధృతరాష్ట్రుడు పాత్ర పోషించామని మాజీ మంత్రి , టీడీపీ గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కుటుంబ సభ్యులతో వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వారికి పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు శేషవస్త్రం కప్పి , మంత్రాక్షితలు రాఘవేంద్రస్వామి మెమోంటో ఇచ్చి ఆశీర్వదించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడాతూ మేము అప్పట్లో మంత్రిగా కళ్లకు బట్టలు కట్టుకొని ధృతరాష్ట్ర పాత్ర పోషించాం అని మాజీ సిఎం జగన్ పై ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం వివాస్పద వ్యాఖ్యలు చేశారు. తిరుమల లడ్డులో రుచి లేదని భక్తులు ఆ రోజుల్లోనే ఫిర్యాదు చేశారు. 2019 నుండి 2024 వరకు ప్రసాదంలో కల్తీ నెయ్యి జరిగిందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం జగన్ పై విరుచుకో పడ్డారు. దేవాలయాలు సియం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని తిరుమల, శ్రీశైలం ప్రసాదంలో కల్తీ నెయ్యి జరిగిందని ఆధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు వారి వెంట మంత్రాలయం సిఐ రామాంజులు , ఎస్ఐ మల్లికార్జున , హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు ,కానిస్టేబుల్ రామకృష్ణ ,టీడీపీ నాయకులు మేకల నరసింహ , తదితరులు ఉన్నారు.

# గుమ్మనూరుకి సన్మానం



మంత్రాలయం, ఫిబ్రవరి 9 (మనం న్యూస్)ః అనంతపురం జిల్లా గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోమవారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయం వచ్చారు. ముందుగా ఆయన రాఘవేంద్రస్వామిని దర్శనార్థం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కు ఎల్ ఎల్ సీ డీసీ 5 ఛైర్మెన్ బోయ నరసింహా శాలువా కప్పి, రాఘవేంద్ర స్వామి మెమోంటో అందజేసి సన్మానించారు.

# ఉపాధి హామీలో మహాత్మాగాంధీ పేరు మార్పు తగదు

- జి రామ్ జీ బిల్లును రద్దు చేయాలి
- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు



జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 9 (మనం న్యూస్)ః కేంద్రంలో అధికారం లోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోనే అత్యంత నీరు పేదలకు ఉపయోగపడే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని కుట్ర పడిందని,అందులో భాగంగానే మహాత్మా గాంధీ పేరు మార్చి కొత్తగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ జి రామ్ జి బిల్లును రద్దు చేయాలని లేనిపక్షంలో ఆందోళన తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు హెచ్చరించారు. సోమవారం పీజీఆర్ఎస్ లో తహసీల్దార్ చంద్ర శేఖర్ నాయక్ కు సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాల కమ్యూనిస్ట్ ల పోరాటల ఫలితంగా ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని, తిండైనా పెట్టండి,పనైనా చూపండి జైలుకైనా పంపండి అనే నినాదంతో పెద్ద ఎత్తున పోరాటం చేస్తే సాధించిన అతి పెద్ద పథకం ఉపాధిహామీ పథకం అన్నారు.అలాంటి పథకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని కొత్తగా ప్రవేశపెట్టిన జీ రాంజీ బిల్లు వల్ల ఉపాధి హామీ కూలీలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలకు 250 వందల రోజులు పని దినాలు కల్పించి వేతనం 600 రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈనెల 11 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో జి రాంజీ బిల్లు రద్దు కొరకు తీర్మానం చేసి కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపాలన్నారు.

దేశంలో మోడీ రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం పేదల పట్ల కక్ష్య పూరితంగా వ్యవహరిస్తూ ఉపాధి హామీని నిర్వీర్యం చేయాలని చూస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి మాగబుల్ బాషా, తిరుపతయ్య, రాజు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రేపు బండే గురువులు జాతరకు అందరూ ఆహ్వానితులే

- పీఠాధిపతి శ్రీబండేగురుస్వామి



నందవరం, ఫిబ్రవరి 9(మనం న్యూస్)ః నందవరం మండల పరిధిలోనే స్థానిక పూలచింత గ్రామంలో ఈనెల 12న బండే గురువుల జాతర మహోత్సవానికి భక్తులు, ప్రజలు నాయకులు తరలిరావాలని పూలచింత మఠం 6వ పీఠాధిపతి శ్రీబండే గురుస్వామి కోరారు సోమవారం ఆయన మాట్లాడారు పూలచింత గ్రామంలో వెలసిన శ్రీసద్గురు బండే గురువుల జాతర మహోత్సవం ఈనెల 12న వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతేడాది అత్యంత వైభవంగా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆంధ్ర తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈఏడాది కూడా అశేష భక్తులు విశేష పూజాది కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు జాతర మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు శ్రీబండేగురు మూర్తికి రుద్రాభిషేకం, 10 గంటల నుంచి అన్నదాన ప్రసాదం, మధ్యాహ్నం 2 గంటల నుంచి పల్లకి, నందికోలు, మేళ తాళాలతో శ్రీవారి మూలస్థానానికి పూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 4.30 గంటలకు రథోత్సవం, రాత్రి 10 గంటల నుంచి అఖండ భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు బండే గురువు తెలియజేశారు.

# దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు

- నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్
- స్వచ్ఛతలో నగరాన్ని టాప్లో ఉంచుదాం
- గుత్తేదారుల బిల్లుల నమోదు వేగవంతం
- డ్రైనేజీ కాలువల్లో పైప్లైన్ల తొలగింపు



కర్నూలు ఫిబ్రవరి 09మనం న్యూస్ః నగరపాలక సంస్థ పరిపాలనలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం వెంకటరమణ కాలనీలోని నగరపాలక కార్యాలయంలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య, అకౌంట్స్ విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వివిధ కారణాలతో పెండింగ్లో ఉన్న గుత్తేదారుల బిల్లుల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, సకాలంలో మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం అవసరమైన ప్రత్యేకంగా తాత్కాలిక సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. డ్రైనేజీ కాలువల్లో ఉన్న తాగునీటి పైప్లైన్లను వెంటనే గుర్తించి తొలగించాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షన్ మార్గదర్శకాల ప్రకారం అమలు చేయాల్సిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంపొందించే గోడచిత్రాలు, సుందరీకరణ పనులు, భవన నిర్మాణ వ్యర్థాల సమర్థ నిర్వహణ, పాఠశాలల్లో తడి-పొడి చెత్త స్వీయ నిర్వహణపై విద్యార్థులకు చైతన్యం కల్పించడం, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి లోన్ మేళాలను నిర్వహించడం వంటి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

స్వచ్ఛతలో నగరాన్ని అగ్రస్థానంలో నిలపడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్, కార్యదర్శి నాగరాజు, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డిఈఈలు కృష్ణలత, నరేష్, సూపరింటెండెంట్ మంజూర్ బాష తదితరులు పాల్గొన్నారు.


# ముఖ్యమంత్రి సహాయం కింద చెక్కులు పంపిణీ



- లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బీవీ

నందవరం, ఫిబ్రవరి 9(మనం న్యూస్)ః నందవరం మండల పరిధిలోని మాచాపురం గ్రామానికి చెందిన ఇద్దరు లబ్ధిదారులు ఆశీర్వాదం బోయ నాగేంద్ర నందవరం గ్రామానికి చెందిన ఒకరకు మొత్తము ముగ్గురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులు అందుకోవటం జరిగింది చెందిన ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన 22 మంది బాధితులకు రూ. 6.09 లక్షలు విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని 188 మంది బాధితులు రూ.1.59 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందుకున్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఖాసిం వలి రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్న రాముడు బడేసాబ్ సద్దాం హుస్సేన్ మిట్ట సోమాపురం వీరేష్ చిన్న కొత్తిలి సత్తిరెడ్డి ఆదిశేషులు మరియు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# సమాజానికి సేవ చేసినప్పుడే మనిషికి విలువ



- వైసిపి నేత జక్కయ్య
- చర్చి నిర్మాణానికి 20,000 ఆర్థిక సాయం

మంత్రాలయం, ఫిబ్రవరి 9(మనం న్యూస్)ః సమాజానికి సేవ చేసినప్పుడే మనిషికి విలువ ఉంటుందని వైసీపీ బూదురు గ్రామ నేత బుజ్జిగా మీనిగి జక్కయ్య అన్నారు. మంత్రాలయం మండల పరిధిలోని బూదురు గ్రామంలో తన స్వగృహంలో, యెమ్మిగనూరు మండలం సోగునూరు గ్రామంలో సిఎస్ఐ సంఘం నిర్మిస్తున్న చర్చి నిర్మాణానికి 20000 ఆర్థిక సాయం సంఘ పెద్దలు ప్రకాశం పాలరాజు ప్రసాద్ దేవసాయం దానియేలు కర్రెనులకు అందజేశారు. ఆ గ్రామానికి చెందిన సంఘ పెద్దలు జక్కయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

# అదుపు తప్పి ఇసుక ట్రాక్టర్ బోల్తా -డ్రైవర్ మృతి



మంత్రాలయం ఫిబ్రవరి 9,మనం న్యూస్ న్యూస్ : మండల పరిధిలోని చెట్నహళ్లి గ్రామ సమీపంలో తుంగభద్ర నది నుండి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన లో డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. మంత్రాలయం ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు చెట్నహళ్లి గ్రామానికి మేకల రాఘవేంద్ర (22) అనే యువకుడు తుంగభద్ర నదినుండి ట్రాక్టర్ లో ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం లో ట్రాక్టర్ ఇంజన్ డ్రైవర్ రాఘవేంద్రపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన యువకుడికి భార్య పద్మావతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం మృత దేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోండి

- కళింగ కోమటి కార్పొరేషన్ డైరెక్టర్ తంగుడు సంతోష్



విశాఖపట్నం, ఫిబ్రవరి 09 మనం న్యూస్ : విశాఖపట్నం జిల్లాలో నివసిస్తున్న ప్రతి కళింగ కోమటి (కళింగ వైశ్య) కుటుంబ సభ్యుడు తప్పనిసరిగా తమ పరిధిలోని సచివాలయాల్లో కుల ధ్రువీకరణ పత్రం బిసిడి కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కోమటి కార్పొరేషన్ డైరెక్టర్ తంగుడు సంతోష్ కోరారు. సోమవారం విశాఖలోని అభయ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సామాజిక వర్గానికి ఎదురవుతున్న బిసి డి సర్టిఫికేట్ల సమస్యను ఇప్పటికే కేంద్ర మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని వారు సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారని తెలిపారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు , విశాఖ ఎంపీ శ్రీ శ్రీ భరత్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు కూడా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అందరి సమన్వయంతో కళింగ వైశ్యులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఈ సామాజిక వర్గాన్ని బీసీ జాబితాలో చేర్చినప్పటికీ, ఇతర జిల్లాల్లో మైగ్రేషన్ సర్టిఫికేట్ నిబంధనల వల్ల సర్టిఫికెట్ల జారీలో ఆటంకాలు కలుగుతున్నాయని, ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరళతరం చేస్తామని వివరించారు. విశాఖపట్నంలో నివసించే కళింగ వైశ్యులు ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా వెంటనే తమ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా నేరుగా తన సెల్ నెంబర్కు 7416938741 కాల్ చేసి తెలియజేస్తే తక్షణమే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తంగుడు సంతోష్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

# గ్రూప్-2 విజేతకు ఘన సన్మానం



- 'గ్రూప్-2 విజేత సుధీర్ కుమార్ రెడ్డిను సన్మానిస్తున్నవైసీపీ నేతలు

తుగ్గలి,ఫిబ్రవరి 09(మనం న్యూస్ )ః ఆత్మవిశ్వాసంతో గ్రూప్ - 2 ఉద్యోగం సాధించిన సుధీర్ కుమార్ రెడ్డి నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమని వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు శ్రీరంగడు, వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్ యాదవ్ అన్నారు.సోమవారం గుత్తి ఎర్రగుడి గ్రామం లో కొండారెడ్డి స్వగృహానికి వెళ్లి వైఎస్ఆర్సిపి నేతలు సుధీర్ కుమార్ రెడ్డి ను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సీపీ నేతలు మాట్లాడుతూ పట్టుదలతో చదువుతే దేన్నైనా సాధించవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో సురేష్, సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- ఉపాధ్యాయురాలు స్వర్ణ కుమారి



తుగ్గలి, ఫిబ్రవరి 9 (మనం న్యూస్ )ః విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పగిడిరాయి ఉపాధ్యాయురాలు స్వర్ణ కుమారి సూచించారు. సోమవారం ఉపాధ్యాయురాలు స్వర్ణ కుమారి జన్మదినం పురస్కరించుకొని పగిడిరాయి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విక్రమ్ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రి 145 మంది విద్యార్థులకు అందజేశారు.విద్యార్థులు బాగా చదువుకుని వివిధ రంగాలలో రాణించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఐ నాయకులు వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు శ్రీరాములు,టీచర్ రుక్సానా,నాగేశ్వరావు, సిఆర్ఎంటి నాగేష్,గోల్ మైనింగ్ వాలంటీర్ ముని,నల్లన్న, నాగుభూషణం,సురేష్ పాల్గొన్నారు.

# షూటింగ్ బాల్ విజేత గిరిజన ఆశ్రమ పాఠశాల



కర్నూల్ ఫిబ్రవరి 09మనం న్యూస్ ః తిరుపతి పట్టణంలో ఫిబ్రవరి 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగిన ఐదవ జూనియర్ సౌత్ జోన్ పోటీలలో ఫైనల్ నందు తెలంగాణ జట్టుపై ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించింది. కర్నూలు బి. క్యాంపు నందు గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అభిలాస్ , మధు ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించడంలో కీలకపాత్ర పోషించారు.అందుకు విద్యార్థులను గిరిజన సంక్షేమ అధికారి సురేష్ గారు,హెడ్మాస్టర్ శివకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు రమ్య , పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

# గ్రామ కమిటీలే పునాది

- వైసీపీ మండల కన్వీనర్ ప్రహ్లాద ఆచారి



కౌతాళం, ఫిబ్రవరి 09 మనం న్యూస్ ః వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీలే పునాది అని పార్టీ మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద ఆచారి అన్నారు.కౌతాళం వైఎస్ఆర్సిపి పార్టీ ఆఫీసులో ఎమ్మెల్యే వై.బాలనాగరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కమిటీ,అనుబంధ కమిటీల నియమా కానికి వివరాలను పరిశీలించారు అనుబంధ గ్రామ కమిటీలు మండలంలో 200 మంది సభ్యులను ఎన్నుకుంటామన్నారువారికి ఐడి కార్డులు వస్తాయి అన్నారు.ఈ కార్యక్రమంలో పిఏ వెంకటరామరెడ్డి మండల సర్పంచ్ పాల్దినకర్,ఉపసర్పంచ్ సక్రతికయ్య,వడ్డే రాము,పాల్ రెడ్డి,లింగారెడ్డి, నర్సిరెడ్డి,సమ్మద్, డింగి రామకృష్ణ,వడ్డే ఉసేని,బెస్త నారాయణ,బెస్త నాగరాజు,భీమ యూత్ లీడర్ భీమేష్ ,వడ్డే, నరసింహ నందిశ్ రెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

T20 WORLD CUP

## ఇటలీపై స్కాట్లాండ్ ఘన విజయం

టీ20 ప్రపంచ కప్ 2026 లో భాగంగా ఇటలీతో జరిగిన మ్యాచ్ లో స్కాట్లాండ్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 208 పరుగుల లక్ష్యఛేదనలో ఇటలీ.. 16.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. బెన్ మనెంటి (52; 31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), హెన్రీ మానెంటి (37; 25 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్లు), స్మట్స్ (22; 11 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్లు) మాత్రమే రాణించారు. స్కాట్లాండ్ బౌలర్లలో మైకేల్ లీస్క్ 4, మార్క్ వాట్ 2, బ్రాడ్ క్యూరీ, బ్రాడ్ వీల్, డేవిడ్సన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. 12 ఓవర్లకు 113/3తో ఉన్న ఇటలీ.. వరుసగా వికెట్లు కోల్పోయి కుప్పకూలింది. ఆ జట్టు 21 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లను కోల్పోయింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేపట్టిన స్కాట్లాండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జ్ మున్సే (84; 54 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్ లు) హాఫ్ సెంచరీతో మెరిశాడు. మరో ఓపెనర్ మైకేల్ జోన్స్ (37; 30 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్ లు) రాణించాడు. ఈ జోడీ తొలి వికెట్ కు 126 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. తర్వాత వచ్చిన బ్రాండన్ మెక్ ముల్లెన్ (41*; 18 బంతుల్లో 4 సిక్స్ లు) మెరుపులు మెరిపించాడు. రిచీ బెరింగ్టన్ (15) పరుగులు చేశాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో మైకేల్ లీస్క్ (22*; 5 బంతుల్లో) వరుసగా 4, 2, 4, 6, 6 బాదేయడంతో స్కోరు 200 దాటింది. ఇటలీ బౌలర్లలో అలీ హసన్, గ్రాంట్ స్టీవర్ట్, థామస్ డ్రాకా, స్మట్స్ తలో వికెట్ సాధించారు.



## మరో పసికూనను వణికించిన జింబాబ్వే

టీ20 ప్రపంచకప్ 2026లో జింబాబ్వే ఘనంగా బోణీ కొట్టింది. ఒమన్ తో ఇవాళ (ఫిబ్రవరి 9) జరిగిన మ్యాచ్ లో సునాయాస విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో జింబాబ్వే బౌలర్లు చెలరేగిపోయారు. రిచర్డ్ నగరవ (4-1-17-3), బ్లెస్సింగ్ ముజరబానీ (4-1-16-3), బ్రాడ్ ఈవాన్స్ (3.5-0-18-3), సికందర్ రజా (4-0-17-1) ధాటికి ఒమన్ 103 పరుగులకే (19.5 ఓవర్లలో) కుప్పకూలింది.

ఒమన్ ఇన్నింగ్స్ లో కేవలం ముగ్గురే రెండంకెల స్కోర్లు చేశారు. సుఫ్యాన్ మెహమూద్ 25, వినాయక్ శుక్లా 28, నదీద్ ఖాన్ 20 పరుగులు చేయడంతో ఒమన్ అతికష్టం మీద 100 పరుగుల మార్కును తాకింది. మిగతా ఆటగాళ్లలో ఆమిర్ కలీమ్, కెప్టెన్ జతిందర్ సింగ్, షా ఫైసల్ తలో 5 పరుగులు, షకీల్ అహ్మద్ 4, జితెన్ రామనంది 1, వసీం అలీ 3 పరుగులు చేయగా.. హమ్మద్ మీర్జా, కరన్ సోనావలే డకౌట్లయ్యారు.



అనంతరం 104 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని జింబాబ్వే ఆడుతూపాడుతూ ఛేదించింది. 13.3 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. బ్రియాన్ బెన్నెట్ (48 నాటౌట్), బ్రెండన్ టేలర్ (31 రిటైర్డ్ హర్ట్) రాణించారు. మరుమని 21, సికందర్ రజా 5 (నాటౌట్) పరుగులు చేయగా.. డియాన్ మైర్స్ డకౌటయ్యాడు. ఒమన్ బౌలర్లలో సఫ్యాన్ కు రెండు వికెట్లు దక్కాయి. బ్లెస్సింగ్ ముజరబానీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.




## కిరణ్ అబ్బవరం, జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా కాంబినేషన్‌లో భారీ బడ్జెట్ సినిమా

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం మరో క్రేజీ ప్రాజెక్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్ తో చేతులు కలిపారు. వీరు కిరణ్ హీరోగా ఓ భారీ 'పాన్-ఇండియా' సినిమాను నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నారు. మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల నేపథ్యంలో ఒక అద్భుతమైన 'మైథాలజీ యాక్షన్ ఎంటర్ టైనర్'గా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కు కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వరల్ క్లాస్ 'విజువల్స్', హై టెక్నికల్ వాల్యూస్ తో సినిమాను నిర్మించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఈ సినిమా షూటింగ్ ను వచ్చే సెప్టెంబర్ నెలలో ప్రారంభించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

హీరోయిన్ ఎంపిక విషయంలోనూ చిత్ర బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. బాలీవుడ్ లేదా టాలీవుడ్ కు చెందిన ప్రముఖ హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. సినిమా టైటిల్, డైరెక్టర్, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను త్వరలోనే అధికారికంగా అనౌన్స్ చేయనున్నారు. భక్తి, ఎమోషన్స్, డ్రామా, మరియు హై-వోల్టేజ్ యాక్షన్ కలయికతో రూపొందుతున్న ఈ చిత్రం.. అన్ని వర్గాల ఆడియన్స్ ను ఖచ్చితంగా ఆకట్టుకుంటుందని నిర్మాతలు నమ్మకంగా ఉన్నారు.

## సౌత్ ఏషియా సెపక్‌టక్రా ఛాంపియన్‌షిప్

## ఐదు బంగారు పతకాలు గెలుచుకున్న భారత్






కొలంబోలో జరిగిన సౌత్ ఏషియా సెపక్‌టక్రా ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళలు, పురుషుల జట్లు చరిత్ర సృష్టించాయి. ఐదు బంగారు పతకాలు సాధించి అద్భుత విజయాలను నమోదు చేశాయి. సెపక్‌టక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ సోమవారం నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సెపక్‌టక్రా మేనేజ్మెంట్ కమిటీ నాయకత్వంలో ఈ లెగ్ వాలీ బాల్ వేగంగా ప్రాచుర్యం పొందుతోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఖేలో ఇండియా ఖేలో ఉద్యమ స్ఫూర్తిని సాకారం చేస్తూ భారత ఆటగాళ్లు చారిత్రక విజయం సాధించారని పేర్కొన్నారు. ఈ స్పోర్ట్ ఇండియాలో మరింత జనాదరణ పొంది రికార్డులు సృష్టిస్తుందనీ, యువతలో క్రీడాభిమానం, స్పోర్ట్స్‌మెన్‌షిప్ భావనను పెంపొందింపజేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల టోక్యోలో జరిగిన 2026 ఏషియన్ గేమ్స్ టెస్ట్ ఈవెంట్లోనూ భారత పురుషుల సెపక్‌టక్రా జట్టు గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. ఈ విజయంపై సౌత్ ఏషియా సెపక్‌టక్రా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, సెపక్ టక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉమ్మడి కార్యదర్శి పెరిక సురేష్, జనరల్ సెక్రటరీ నరేష్ కుమార్ ఆటగాళ్లు, కోచ్‌లు, మేనేజ్‌మెంట్ ఫెడరేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు.




## వేడిగా దోసెలు వేసి వడ్డించిన హీరోయిన్..

సంక్రాంతికి వస్తున్నాం సినిమా తర్వాత ఐశ్వర్య రాజేశ్ దశ తిరిగిపోతుందనుకున్నారంతా! స్టార్ హీరోల సినిమాల్లో ఆఫర్ అందుకుని ఫుల్ బిజీ అవుతుందనుకున్నారు! కానీ, అలాంటిదేమీ జరగలేదు. పెద్ద సినిమాల ఆఫర్లు రాలేదు. దీంతో తెలుగులో చిన్న సినిమా అయినప్పటికీ కథ నచ్చడంతో 'ఓ సుకుమారి'లో కథానాయికగా నటిస్తోంది.

అలాగే తమిళంలో రెండు, కన్నడలో ఒక మూవీ చేస్తోంది. తాజాగా తను సెట్ లో చెఫ్ గా మారింది. సెట్ లో ఉన్నవారికి స్వయంగా దోసెలు/ ఊతప్పం వేసి వడ్డించింది. సెట్ లో ఈ పని చేయడమంటే నాకెంతో ఇష్టం అంటూ అందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది.

పద్ధతిగా చీర కట్టుకున్న ఐష్.. పెనంపై చిన్న దోసెలు వేస్తూ, వాటిని తిరగేస్తూ వేడివేడిగా వడ్డించింది. ఇంకా ఎవరికి కావాలి, రండి అంటూ అక్కడున్నవారితో ఇట్టే కలిసిపోయింది. ఈ వీడియో వైరల్ గా మారగా కీర్తి సురేశ్ హే, దోసె.. దోసె అంటూ ఫన్నీ కామెంట్ పెట్టింది. అందుకు ఐష్ స్పందిస్తూ.. అవును, నీ ఫేవరెట్ అని రిప్లై ఇచ్చింది.



## 'ది ప్యారడైజ్' నుంచి ఆయా షేర్ అంటూ వస్తున్న జడల్..!

న్యాచురల్ స్టార్ నాని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి క్రేజీ అప్ డేట్ వచ్చేసింది. ఈ సినిమాలోని మొదటి సింగిల్ 'ఆయా షేర్' త్వరలోనే విడుదల కాబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ మాస్ డ్యాన్స్ నంబర్ కోసం ఫ్యాన్స్ సోషల్ మీడియాలో అప్పుడే రచ్చ మొదలుపెట్టారు. ప్రస్తుతం ఈ పాట విడుదల తేదీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దీనికి సంబంధించిన వివరాలను చిత్ర బృందం త్వరలోనే వెల్లడించనుంది. అలాగే, సినిమా కొత్త విడుదల తేదీని కూడా త్వరలోనే అనౌన్స్ చేసే అవకాశం ఉంది. 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని-శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ భారీ ప్రాజెక్ట్ లో కయాదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. మోహన్ బాబు, సోనాలి కుల్కర్ణి, బాబు మోహన్ మరియు తనికెళ్ల భరణి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎస్ఎల్వీ సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## 'స్పిరిట్' వార్తలపై ప్రకాష్ రాజ్ ఫైర్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమాలో విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్ర యూనిట్ గతంలోనే వెల్లడించింది. అయితే, ఈ సినిమాలో నుంచి తాను తప్పుకున్నట్లు వస్తున్న వార్తలను నటుడు ప్రకాష్ రాజ్ తీవ్రంగా ఖండించారు. గత రెండు రోజులుగా దర్శకుడు సందీప్ వంగతో ప్రకాష్ రాజ్ కు గొడవ జరిగిందని, అందుకే ఆయన ఈ ప్రాజెక్ట్ నుండి వైదొలిగారని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగింది.

ఈ పుకార్లపై ప్రకాష్ రాజ్ తన ఎక్స్(ట్విట్టర్) అకౌంట్ లో ఘాటుగా స్పందించారు. 'విషపూరితమైన ఫేక్ న్యూస్ ప్రచారం చేసేవారికి.. 'స్పిరిట్' సినిమా గురించి ఒక్క విషయం చెప్పాలి. అసలు నా సన్నివేశాలకు సంబంధించిన షూటింగే ఇంకా మొదలవ్వలేదు. అప్పుడే మీ 'వాట్సాప్ ఫ్యాక్టరీ'లో కథలు అల్లేస్తున్నారా? కాస్త ఎదగండి.. మీ పనులు మీరు చూసుకోండి' అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ స్పష్టతతో 'స్పిరిట్' సినిమాలో ప్రకాష్ రాజ్ కొనసాగుతున్నారని తేలిపోయింది. ఈ చిత్రంలో ఆయన ప్రభాస్ తండ్రి పాత్రలో లేదా ఒక కీలకమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ భారీ యాక్షన్ డ్రామా మార్చి 2027లో విడుదల కానుంది.



## 'గాయపడ్డ సింహం'తో నవ్వులు పూయిస్తున్న తరుణ్ భాస్కర్

డైరెక్టర్ తరుణ్ భాస్కర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'గాయపడ్డ సింహం' టీజర్ విడుదలై సోషల్ మీడియాలో తెగ నవ్వులు పూయిస్తోంది. కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను పవన్ సాదినేని సమర్పిస్తున్నారు. చిన్నప్పటి నుంచి అమెరికా వెళ్లాలని కలలు కని, తీరా అక్కడికి వెళ్ళాక డొనాల్ ట్రంప్ నిర్ణయంతో కథానాయకుడు చిక్కుల్లో పడటం అనే ఆసక్తికరమైన పాయింట్ తో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్ తన కామెడీ టైమింగ్ తో అదరగొడుతున్నాడు. ముఖ్యంగా తన సొంత సినిమా 'పెళ్లి చూపులు' ఓవర్ రేటెడ్ అంటూ తనను తాను ట్రోల్ చేసుకున్న సీన్ టీజర్ కే హైలైట్ గా నిలిచింది. ఫరియా అబ్దుల్లా, శుభలేఖ సుధాకర్ కె.జి.ఎఫ్ స్టైల్ నరేషన్ తో నవ్వులు పంచుతుండగా, మానస చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. స్వీకర్ అగస్తీ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సమ్మర్ 2026లో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.



## ఉర్రూతలూగించేలా 'యమ యమ్మ' పాట

'జాతిరత్నాలు' ఫేం అనుదీప్, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కాంబినేషన్ లో తెరకెక్కిన తాజా చిత్రం 'ఫంకీ'. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఫిబ్రవరి 13న ఈ చిత్రం విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, 'ధీరే ధీరే', 'రట్టాటటావ్' పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడవ గీతం 'యమ యమ్మ' విడుదలైంది.

భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ మాస్ గీతానికి దేవ్ పవార్ సాహిత్యం అందించాడు. గాయని రోహిణి సోరట్ తో కలిసి సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను ఆలపించడం విశేషం. తమ ఉత్సాహభరితమైన గాత్రంతో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. విశ్వక్ సేన్, కయాదు లోహర్ అదిరిపోయే మాస్ బీట్ లు, ఆట సందీప్ మాస్టర్ అద్భుతమైన నృత్యరీతులతో మాస్ పాటల అభిమానులకు విందు భోజనంలా మారింది.

గీతావిష్కరణ కార్యక్రమంలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. 'ఒక మంచి సినిమా అందించాలనే ఉద్దేశంతోనే సంవత్సరం విరామం తీసుకొని ఫంకీ సినిమా చేశాను. ఈ చిత్రం మీ అందరినీ మెప్పిస్తుంది. ఇదొక క్లీన్ ఎంటర్టైనర్. మీ కుటుంబంతో కలిసి థియేటర్ కి రండి. రెండు గంటల పది నిమిషాల పాటు అన్నీ మర్చిపోయి కడుపుబ్బా నవ్వుకుంటారు. ఫిబ్రవరి 13న థియేటర్లలో కలుద్దాం. మిమ్మల్ని ఈ సినిమా అసలు నిరాశపరచదు.' అన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.